# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 6

పేజీలు 40

ఫిబ్రవరి 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................... ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం ........................................ | 2 |
| శ్రీబాబూజీ ఉవాచ | 3 |
| శ్రీమాతాజీ సత్సంగ కార్యక్రమాలు | 5 |
| శ్రీమాతాజీవారి నూతన సంవత్సర సందేశం | 6 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| యోగవాశిష్ఠము | 13 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 15 |
| పంచ 'వ' కారాలు | 16 |
| పరిప్రశ్నేన సేవయా | 17 |
| ఆనంద మానందమాయె | 18 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| సర్వము నీ దయ | 21 |
| వర్ణనాతీతం రామనామ మహాత్మ్యం | 23 |
| చెన్నై, ముంబయు నగరాలలో శ్రీమాతాజీ సంత్సంగ విశేషాలు | 25 |
| రాధాతత్త్వము | 28 |
| హితోపదేశము | 29 |
| సత్సంగామృతం | 31 |
| శ్రీబాబూజీతో అనుభవాలు | 33 |
| గీతోపదేశం | 35 |
| సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర | 37 |
| విష్ణు కథలు – 'రోహిదాసు' | 39 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

నాలం వాసకృదేవ భవతస్సేవా నతిర్వానుతిః
పూజా వా స్మరణం కథా శ్రవణమప్యాలోకనం మా దృశామ్
స్వామిన్నస్థిర దేవతానుసరణాయా సేన కిం లభ్యతే
కావాముక్తి రితః కుతో భవతి చేత్కిం ప్రార్థనీయం తదా
(శివానంద లహరి 33వ శ్లో.)

"భగవానుని పూజగాని, స్తుతిగాని, స్మరణగాని, సేవగాని ముక్తిని ప్రసాదిస్తుంది. అయితే అవ్యక్తుడైన భగవానుని సేవించటం ఎలాగ? దేవాలయాలలోని దేవతా మూర్తులను సేవించి ముక్తిని పొందటం వీలవుతుందా? భక్తుడు ఆచరించే క్రియలో, భావనలో, దృష్టిలో భేదం లేనంతవరకూ ఏదైనా సాధ్యమే అని భావించాలి.



భగవంతుని సేవ మనో వాక్కాయాల ద్వారా సాధారణమైనదే కదా! పూజ కాయముతో నిర్వహించేది. ధ్యానము మానసికమైనది. సంకీర్తన వాచకమైనది. త్రికరణముల ద్వారా నిర్వహించే సేవ ద్వారా త్రికరణ శుద్ధి కలగటం సహజమే కదా!

భగవత్సాక్షాత్కారం కలగాలనే యిచ్ఛ పెంపొందిన కొద్దీ ప్రేమ మూర్తియైన భగవానుడే గురు రూపంలో సాక్షాత్కరించి అనుగ్రహిస్తాడు. సద్గురుమూర్తి సేవ, గురుసాన్నిధ్యము, గురూపదేశము అపరోక్షానుభూతి పొందటానికి అతి సులువైన మార్గము. 'బ్రహ్మైవ ఆచార్య రూపేణ వతిష్ఠతే' అనే శ్రుతి వాక్యము దీన్ని వివరిస్తోంది.

ఇక నిత్యుడు, శాశ్వతుడు, ఆనందమయుడైన భగవానుని త్రికరణ శుద్ధిగా సేవించినా, కీర్తించినా, స్మరించినా, పూజించినా, చరిత్ర విన్నా కృతార్థులు కానివారెవరైనా ఉన్నారా? అయితే భక్తుడు చేసే క్రియకు భావనకు వ్యత్యాసం లేనంతవరకు ఆశయసిద్ధి తప్పదు. 'కృష్ణ ప్రణమామి న పునర్భవామి' అని వచించిన శ్రీశంకర భగవత్పాదులవారి మాట అసత్యమని చెప్పగలవారెవరైనా ఉన్నారా? జగద్గురువు శ్రీకృష్ణుని మనసారా సేవించినవాడు మరల జన్మించడు. ఇది మాత్రం సత్యం" అని శ్రీబాబూజీ మహరాజ్ ఉద్బోధించారు.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

'సద్గురుమూర్తి త్రిమూర్తి స్వరూపుడు. అంటే సాక్షాత్తు భగవంతుడనేగా? మరి భగవంతుడు మానవాకారంలో ఉంటాడా? నాన్‌సెన్స్ నేను నమ్మను' అన్న భక్తుల ప్రస్థావన వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "వారి సందేహాన్ని తప్పుపట్టవల్సిన అవసరంలేదు. సత్యగురువు తనకి ఇంతమంది శిష్యులు కావాలని గాని, ప్రజలు అహో!ఓహో! పొగడ్తలకిగాని, శిష్యులంతా తనకి సాష్టాంగ నమస్కారము చెయ్యాలని గానీ ఎన్నడూ ఆశించడు. సత్యగురువు ఎన్నడూ శిష్యుల ధనధాన్యాలను, భోగభాగ్యాలను ఆశించడు. ఆయన వారినుండి ఆశించేది నిష్కల్మషమైన, శుద్ధమైన మనోపుష్పము మాత్రమే" అని అన్నారు.



శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "భగవానుడు మానవాకారంలో ఉంటాడా అని సందేహించే వ్యక్తి ఎంతో శ్రమించి, ధనాన్ని వెచ్చించి, ఎక్కడో కొండపైన ఉన్న శిలావిగ్రహంలో భగవంతుణ్ణి ఎలా దర్శించగల్గుతున్నాడు? చైతన్య సహితమై, మానవరూపధారణ చేసి ఏ విధమైన ప్రతిఫలాన్ని ఆశించక సత్యాన్ని, ధర్మాన్ని స్థాపించటానికి విచ్చేసిన సద్గురు మూర్తిలో దివ్యత్వాన్ని సందర్శించలేకపోవటాన్ని ఏమంటారు? మీరే ఆలోచించండి. 'సాధకుడు కడుజాగరూకతతో వుండాలి' అని హెచ్చరిస్తూ శ్రీ బాబూజీ మహరాజ్ మీరంతా సాధకులే గనుక ఇటువంటి చర్చలో పాల్గొన్నప్పుడు మీ మనస్సు చిక్కుడు గింజలాగా జారిపోకుండా నక్కిరి గింజలాగా గురుచరణారవిందములకు అతుక్కుని ఉండాలి.

విశ్వాసం పెరిగిన కొద్దీ అదే ఆ దివ్యచరణారవిందములపై పుట్టుమచ్చ అయిపోవాలి. గురుస్థానం చాలా క్లిష్టమైనది. ఎంతో బాధ్యతతో కూడినది. తనను ఆశ్రయించిన శిష్యుడు ఎటువంటి వాడైనా ఉద్ధరించక

తప్పదుకదా! పదిమంది శిష్యులకు గురువుగా బాధ్యత నిర్వహించడం కన్న ఒక సమర్థుడైన సద్గురు మూర్తిని ఆశ్రయించిన శిష్యుని జీవితం ధన్యమైనది. నన్ను ఆశ్రయించిన శిష్యులలో రకరకాల ప్రవర్తనలు గలవారున్నారు."

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "గురుమూర్తి సమక్షంలోనే ముక్కుపొడుం పీల్చేవారినీ, గురుమూర్తికి తెలిసినా ఏ రకమైన స్పందన లేకుండా చుట్ట కాల్చేవారిని, ఆయన సమక్షంలోనే అవేశపూరితమైన సంభాషణ చేసేవారిని, గురువాజ్ఞాపాలన చేయటంలో నిర్లక్ష్య వైఖరి చూపిన వారిని కూడా ఏదో విధంగా వారిని గమ్యస్థానానికి చేర్చక తప్పదు కదా!

సద్గురుమూర్తి తనను ఆశ్రయించిన శిష్యులను ఎన్నడూ శిక్షించడు, కష్టపెట్టడు. కానీ, వారికి తగిన శిక్షణ ఇస్తారు. గురుశిక్షణ లేని సాధన ఫలించదు. సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించకుండా కర్తృత్వ భావనతో సాధన చేసేవాడు అహంకారపూరితుడై, నడి సముద్రములో దిక్సూచి లేని నావవలె ఎన్నడూ గమ్యస్థానం చేరడు. గురుశిక్షణలేని సాధకుని స్థితి దారము తెగిన గాలిపటమువలె ఉంటుంది! సత్యగురువుని ఆశ్రయించి త్రికరణశుద్ధిగా తను, మనో ధనాలను సమర్పించిన వారి సంచితార్థకర్మ రహితం అవకతప్పదుకదా!" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.



దేవుని సాధన పట్టుదలతో యిప్పుడే ప్రారంభించు. మనస్సు శాంతంగా ఉంచుకో. సురక్షితముగా పరమాత్మను చేరుకోగలవు.

## పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు

పెద నిండ్రకొలను శాఖలో 8-2-2014 శనివారం నుండి 12-2-2014 బుధవారం వరకు సత్సంగ కార్యక్రమాలు నిర్వహింపబడును.

**నిత్యకార్యక్రమములు -**

తె॥జా 4 గం.ల నుండి 6గం.ల వరకు మేలుకొలుపు, సుప్రభాతం, ప్రార్థన. ఉదయం 7గం.లకు నగర సంకీర్తన, 9 గం.ల నుండి సంకీర్తన మరియు తీర్థ ప్రసాదములు. సా॥5గం.ల నుండి రాత్రి 8గం.ల వరకు సంకీర్తన, సత్సంగసమావేశము.

ప్రత్యేక కార్యక్రమము - 10-2-14 సోమవారం భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురుదేవుల దివ్యమంగళమూర్తి ప్రతిష్ఠ దశమవార్షికోత్సవం. శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

వివరములకు : నరసింహారావు 9491222652, హనుమంతు - 9010644758

గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలం, కట్టమూరు గ్రామంలో 20-2-2014 గురువారం నుండి 22-2-2014 శనివారం వరకు సత్సంగ కార్యక్రమాలు నిర్వహింపబడును. **నిత్యకార్యక్రమములు -**

తె॥జా 4 గం.ల నుండి 6గం.ల వరకు మేలుకొలుపు, సుప్రభాతం, ప్రార్థన. ఉదయం 7గం.లకు నగర సంకీర్తన; 9 గం.ల నుండి 12గం.ల వరకు సంకీర్తన మరియు తీర్థ ప్రసాదములు. సాయంత్రం 5గం.ల నుండి రాత్రి 8గం.ల వరకు సంకీర్తన, సత్సంగసమావేశము.

22వ తేదీ ఉదయం 10గం.లకు శ్రీసద్గురుపాదపూజతో కార్యక్రమాలు సమాప్తి.

వివరములకు : కోదండరామ ప్రసాద్ -9704300241,

కాళీప్రసాద్ - 8704827144, రామారావు - 9949275375

పశ్చిమ గోదావరి జిల్లా, నిడమర్రు గ్రామంలో 5-3-2014 బుధవారం నుండి 12-3-2014 బుధవారం వరకు సత్సంగ కార్యక్రమాలు నిర్వహింపబడును.

**నిత్యకార్యక్రమములు -**

తె॥జా 4 గం.ల నుండి 6గం.ల వరకు మేలుకొలుపు,సుప్రభాతం, ప్రార్థన. ఉదయం 6-30 గం.।లకు నగర సంకీర్తన; 11 గం.లకు శ్రీమాతాజీవారిచే తీర్థ ప్రసాదములు. సాయంత్రం 6-30గం.ల నుండి రాత్రి 8-30గం.ల వరకు సత్సంగసమావేశము.

ప్రత్యేక కార్యక్రమము - 5-3-2014 బుధవారం ఉదయం 6-30గం.లకు శోభాయాత్ర, అనంతరం కలశస్థాపన, అఖండ సర్వనామ సంకీర్తన సప్తాహం ప్రారంభం.

వివరములకు : భీమసేన్ - 9393751334, 08818-245583

# శ్రీమాతాజీవారి నూతన సంవత్సర సందేశం

-జపమాలా ప్రసాద

అందరికీ ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు. అందరిలో ప్రకాశిస్తున్న సద్గురు దేవులకి సాష్టాంగ నమస్కారములు.

సకల చరాచర సృష్టిలో ప్రకాశిస్తున్న శ్రీగురుదేవులు ఒక కాలాన్ని నిర్ణయించి, మనస్సు కలిగి ఉన్న మానవుడినే కాక, సృష్టి అంతటినీ కాలబద్ధం చేసి బంధించారు. ఆ భగవంతుడేమో సాక్షాత్ కాల స్వరూపుడు. ఆయనని ఆశ్రయించిన వారికి కాలంతో పనిలేకుండా పోతోంది. స్వామి ఒక్కరే కాలం చేత బంధింపబడరు. అందుకనే శ్రీగురుదేవుల స్తుతిలో "కాలజ్ఞాన విదగ్రణిం" అని వుంది. గురుదేవుని నమ్ముకున్నవారు కాలాన్ని గురించి భయపడవలసిన పనిలేదు.




సర్వసృష్టికి ప్రభువైన, కారణమైన గురు దేవులు కాలాన్ని బద్ధం చేసి కూడా, కాలానికి బంధింప బడకుండా మనకి కొన్ని కార్యక్రమాల రూపంలో, అనేకమైన అనుభూతులను ప్రసాదిస్తున్నారు. మన దృష్టి ఎటువైపున వుంటే, మనకు అటువంటి అనుభూతులే వస్తాయి. మనస్సును భగవంతుడివైపు నిలిపితే, మనకి దివ్యమైన అనుభూతి లభిస్తుంది. అదే ప్రకృతివైపు తిరిగితే దుఃఖం మిగులుతోంది. ఈ విధంగా మన జీవితం సుఖదుఃఖ మిశ్రిత మవడానికి కారకులం మనమే అవుతున్నాం.

శ్రీగురుదేవులది పూర్ణ స్వరూపం. వారి దృష్టి ప్రసారంలోనే కాలం నడుస్తూ వుంటుంది. భగవంతుడిని (గురుదేవుణ్ణి) ముందు పెట్టుకుని నడిస్తే మాయ మనల్ని ఏమీ చేయదు. దీనికే ఒక మహనీయుడు ఒక చిన్న కథని వివరించారు : ఒకతను సూర్యునికి వ్యతిరేకంగా వెళ్తూ వుంటే, అతడి నీడ అతనికంటే ముందుపడి వెళ్తూ వుండటం చూసి, కోపంతో దానినెలాగైనా నిరోధించాలని నానా తంటాలు పడుతున్నాడుట. ఇంతలో ఒక మహనీయుడు అటుగా వెళుతూ, సంగతి తెలుసుకుని, "నాయనా! నువ్వు సూర్యునివైపు తిరిగి నడిస్తే, నీడ నీ వెనకవైపుకి వెళ్ళిపోతుంది" అని చెప్పేసరికి అతడు సూర్యునివైపు తిరగగానే తన నీడ మాయమై పోయింది! అది చూసి ఆనందంతో గంతులు వేశాడు.

మనపనీ అలాగే వుంది. మనం భగవంతుడిని ముందుకు పెట్టుకుని నడిస్తే, మాయ అనే నీడ మనను బాధించదు. కానీ మనం మాయను ముందు పెట్టుకుని నడుస్తున్నాం. అంటే మనస్సు చెప్పినట్లు చేస్తున్నాం. మనస్సుకి లొంగిపోయి దాస్యం చేస్తున్నాం. పైగా "మనసు మాయ" అంటున్నాం. ఆ మనస్సునే మనం నమ్మటం లేదు. అది మాయ అనుకున్న తరువాత దానిని స్వచ్ఛంగా అనుభవించేదెవరు? సుఖము, దుఃఖము కూడా నీ మనస్సుని బట్టే నువ్వు అనుభవిస్తున్నావు. స్వచ్ఛంగా అనుభవించిన వారు మరలా మనస్సు యొక్క మాయలో పడవలసిన అవసరం లేదు.

కలికాలం వచ్చేసిందని భయపడతారు చాలామంది. గురుపాదం ఆశ్రయించిన తరువాత కలికాలం అనేది ఎక్కడ వుంటుంది? కలికాలమనే దానిని నీ మనస్సే తెచ్చి పెడుతోంది. కలికాలంలో యిలా జరుగుతుంది, అలా జరుగుతుంది అని ఎవరో చెబితే అది మనం నమ్ముతున్నాం. కానీ ఆనాడు గోపికల అనుభవంలో "ఇది ఫలానా యుగం" అని వుందా? 'కృష్ణయ్య లేని జీవితం మాకు వద్దు గాక వద్దు' అని దృఢ నిశ్చయం చేసుకున్నారు వారు. ఆ నల్లనయ్య వేణుగానం వినిపించటం ఆలస్యం, పరుగు పరుగున ఆయన దగ్గరకి పరుగులు పెట్టేవారు గోపికలు. కృష్ణుడి మాటలు వినేసరికి తన్మయత్వం చెంది పోయేవారు. ఆకు కదిలితే కృష్ణుని కదలికే అనుకునేవారు. చెట్లలో, పుట్టలలో కృష్ణుని కోసమే వెదుక్కున్నారు గోపికలు. మనమూ తోటలోకి వెళ్ళి వెతుకుతాం! దేనికోసం? "అయ్యో! ఈ చెట్టుకి డజను కాయలు ఉండేవి. ఏమయ్యాయి? ఎవరు కోసేశారు?" అని వెతుకుతాం! ఇంతకీ ఆ కాయలను ఎవరూ కోసుకు వెళ్ళరు. అవి ఆ చెట్టుక్రిందే వుంటాయి. ప్రకృతిగతమైన వాటికోసం వెతుక్కోవటానికే మానవులకి టైము చాలటం లేదు. కానీ మహాత్ములు, భక్తులు, తమనుతాము ఉద్ధరించుకోవటం కోసం వెదుక్కున్నారు.

భగవంతుడిని ముందు పెట్టుకున్న వారికి కలికాలం ఎక్కడిదండీ? మనం రామనామం పాడుకుంటూ వుంటే రాముడిలో లీనమైపోతున్నాం. కృష్ణుణ్ణి కీర్తించినప్పుడు మనసు ఆయనలో లయిస్తోంది. అలాగే శివా! అనేసరికి శివుడి రూపం అయిపోతోంది యీ మనస్సు. ఇది నిజమా, అబద్ధమా? 'నా రాముడు నా ఒడిలోనే వున్నాడు' అని మీరు పొందిన యీ అనుభూతి సత్యమే కదా! బొమ్మలాట ఆడుకున్నట్లు కృష్ణుడు సృష్టినంతటినీ తానే సృష్టిచేసి, తాను కూడా ఆ

బొమ్మలలో ఒక బొమ్మ అయి, అంతటా తానే అయి ఆడుకున్నాడు. అంతటా నిండి వుండటం ఆయన స్వభావం.

"నేను ఎక్కడకు వెళ్ళినా నా ప్రభువు నన్ను వదలటం లేదు. ఆ ప్రభువు నా చిటికెన వ్రేలును ఏనాడూ వదిలిపెట్టడు. ఆయన పట్టు చాల గట్టిది. నేనెక్కడ జారిపోతానో అని గట్టిగా పట్టుకున్నాడు" అని దృఢంగా నమ్మిన భక్తుడు ఏ యుగంలో వున్నట్లు? అట్టి దృఢభక్తి కలిగిన వారెప్పుడూ సత్యయుగంలోనే వుంటారు. భగవంతుడు మనని విడిచి లేడు. దానికి వ్యతిరేకం ఎవరైనా అంటే, వారి జీవితం అయిపోయినట్లే.

భక్తులందరూ కలసి యీ విధంగా సద్విచారణ చేయాలి. అలా చేసి చేసి, అనుభవాన్ని పొందాలి. ఆ ప్రభువు గురించి మాట్లాడుకుంటూ, మాటలు వింటూ, అనుభవిస్తూ, ఆ స్వరూపం మీరయి పోవాలి.

సృష్టినంతటినీ చేసిన పరమాత్మ, తాను చేసిన బొమ్మలు ఆడటానికి, ఆట రక్తి కట్టించడానికి మనసుగాడిని కూడా పెట్టారు. దానితో యీ బొమ్మలు తైతక్కలాడటం మొదలు పెట్టాయి. అపూర్వమైన మానవ జన్మ వచ్చినా కూడా, కామ క్రోధాదులనే అనేక దుష్ట గుణాలని సేకరించుకుని మానవుడు వాటికి బందీ అయిపోతున్నాడు. తద్వారా దుఃఖానికి గురవుతున్నాడు. తాను సృష్టించిన మానవకోటి యీ విధంగా సంకటములలోపడి దుఃఖిస్తూ వుంటే, సృష్టికర్తయైన గురుదేవులు తమ పాదాన్ని తిరిగి మనకు అందిస్తున్నారు. ఆ పాదం యిప్పుడిచ్చారా? కాదు కాదు! ఏనాడో యిచ్చారు. అది కాలాతీతం. తల్లి తన బిడ్డకి స్తన్యమివ్వటంలో ఆలస్యం చేయవచ్చుగానీ, గురుదేవుడు మట్టుకు తమ కృపాశీస్సులను వర్షించడంలో ఏమాత్రం ఆలస్యం చేయరు.

ఆత్మవస్తువు ఏ విధంగా అంతటా వ్యాపించి వుండి కూడా కంటికి కనిపించదో, మనస్సు కూడా కంటికి కనిపించదు. ఏ డాక్టర్లూ కూడా ఆ మనస్సుని చూపించలేరు, అందుకనే మహాత్ములు మనకేమని శెలవిచ్చారంటే, "నీ మనస్సుని ప్రపంచంవైపు తీసుకెళ్తే నువ్వు తట్టుకోలేవు. కనుక దానిని పరమాత్మ మీదకు మరల్చు. అప్పుడు నీ మనస్సు పరమాత్మ రూపమే అయిపోతుంది. నీ మనస్సు మనస్సుగా వుండదు. బుద్ధి బుద్ధిగా వుండదు. అహంకారం అసలే వుండదు. ఇక మనస్సే భగవద్రూపం చెందాక, మిగతా వాటికి ఉనికి ఎక్కడ వుంటుంది?

"నన్ను విడిస్తే మీరు నాశనమైపోతారు" అని శ్రీబాబు ఏనాడూ అనలేదు. వారెప్పుడూ "నేను మీ వాడిని. నేను మీకంటె భిన్నంగా లేను. నేను మీ ప్రక్కనే, మీ లోనే వున్నాను. మీరు చేసేవన్నీ చూస్తూనే వున్నాను.

మా అమ్మ కన్ను, చెవి విశాలమైనవి. ఎక్కడ ఎవరేమి మాట్లాడినా, ఎక్కడ ఎవరున్నా, ఏమన్నా మా అమ్మకి తెలియకుండా వుండదు. మా అమ్మ నాకు అన్నీ చెప్తుంది" అని అనేవారు శ్రీబాబూజీ. వారి దృష్టిలో ఉన్న మనకు భయం ఎందుకు? గురుశక్తి అపారమైనది. గురుకరుణ ఆనంద దాయకమైనది. దానిని మీ మనసులో అనుభవించండి. ఎందుకంటే మనం ఏ విషయమైనా మనసులో తలచుకుంటేనే అది 'కర్మ' అయి కూర్చుంటుందని గీతాచార్యుడు కర్మయోగంలో చెప్పారు. ఇక అప్పుడు మనం యిటువంటి సద్భావనని మనసుకి అందిస్తే, నీకు దివ్యమైన అనుభూతి వస్తుంది. బ్రతికి ఉండగానే కృష్ణతత్త్వంలో ఊరిపోవాలి.

కనుక మనం 2013ని వదలి 2014లో ప్రవేశించాం. సంఖ్యా పరంగా (Numerology) 2013 = 6 ; 2014 = 7. మనలోని కామక్రోధాది గుణాలని శమ, దమాది షట్సంపదగా మార్చుకున్నాం. అంటే '7' అని చూస్తే - సప్తమహర్షులు, సప్త భూమికలు, సప్త ధాతువులు ఉన్నాయి. అంతేకాక, షట్చక్రాలనీ దాటితే, సహస్రారంలో గురుదేవుడు ప్రకాశిస్తూ వుంటారు. 6 దాటి 7 లోకి వచ్చామంటే గురుదేవుడి దగ్గరకి వచ్చేశామన్న మాట. కనుక గురుదేవులు మనని తమ ఒడిలో కూర్చోబెట్టుకున్నారు.

నీలో '2' అనే ద్వైతాన్ని హరింపజేసుకుంటే నీలోని పూర్ణ స్వరూపాన్ని అనుభవించ గలుగుతావు అన్నదానిని సూచిస్తోందా అనడానికి '2' ప్రక్కన '0' ఉంటుంది. ద్వైతం నుండి మనల్ని దాటించ డానికి ఆ ప్రభువు రెండు పాదాలను పెట్టుకుని వున్నాడు. "దేవా! ప్రభూ! కృష్ణా! రామా! అమ్మా! బాబూ!" అనే రెండక్షరాలు గలిగిన పేర్లని పెట్టుకుని ఉన్నాడు. ఆ రెండక్షరాలలో వున్న అక్షరపురుషుడిని ఎవరాశ్రయించి వుంటారో, వారి యొక్క అనుభూతి పూర్ణంగా వుంటుంది. అట్టి అనుభూతిని హాయిగా అందిస్తున్నారు గురుదేవులు. సహస్రారంలో ప్రకాశించేది గురుదేవులయితే యిక మనం ఎక్కడుంటాం? ప్రక్కన ఎక్కడో వ్రేలాడుతూ వుండం కదా! మనం ఊపిరి తీసుకునేదెక్కడ? తిరిగేదెక్కడ? ఉండేదెక్కడ? మన భావనెక్కడ? అంతా గురుస్వరూపమే. మన జీవితమే అందులో తరిస్తోంది.

2014ని ఆహ్వానిస్తున్నాం కాబట్టి 1-1-2014 = 1+1+7=9 అంటే 9 = నవ. మన జీవితంలో అంతా భగవదనుభూతితో నవ్యంగానే వుంటుంది. మన చుట్టూ పరికించి చూస్తే అంతా నూతనంగా, నవనవో

న్మేషణంగా వుంటుంది.

భగవంతుడి సృష్టి అమోఘం. ఒక వృక్షమును చూశామంటే, దీనికి మూలం ఎమిటి? అని విచారిస్తే, విత్తనం మూలమా? ఆ విత్తనానికి శక్తి ఎక్కడి నుంచి వచ్చింది? ఒక చిన్న విత్తనంలో అంత వృక్షం దాగి వుందా? మనందరం కూడా అలాగ ఒక చిన్న బీజము నుండే పుట్టామా? ఈ సకల చరాచర సృష్టికీ బీజం భగవంతుడు తానే అని చెప్పాడు కదా! (బీజం మాం సర్వభూతానాం..........) ప్రపంచ విషయాదులలో కొత్తదనమేమున్నది? తిన్నదే తింటున్నాం. చేసినదే చేస్తున్నాం. కానీ భగవంతుని అనుభూతి ఎప్పుడూ నిత్యనూతనంగా వుంటుంది.

మనకి పునర్జన్మ లేకుండా చేసేది గురుపాదం. చంచలమైన మనస్సులో అనేక దేవుళ్ళని నిలుపుకోలేం. కనుక దేవతలందరికీ మూలమైన గురుదేవుడిని మనసులో నిలుపుకుంటే చాలు. ఒక్క గురు పాదాన్ని ఆశ్రయిస్తే మనం విశ్వంలో వున్న దేవతలందరినీ, అంటే విశ్వ రూపాన్ని మనం అనుభవించవచ్చు, అనే యీ మూల సూత్రాన్ని గురువులు మనకి తెలపకపోతే, మనకి అర్థమవదు. భిన్నత్వంతో కూడుకున్న జగత్తు వ్యవహారానికే తప్ప, *నీ అనుభూతి మాత్రం అవ్యక్తమై వున్నది. అవ్యక్తంలో వున్న అనుభూతి వ్యక్తంగా మారినా నిన్ను బంధించదు.* అవ్యక్తం నుండి అహంకారం; అహంకారం నుండి పంచతన్మాత్రలు; పంచతన్మాత్రల నుండి పంచమహాభూతాలు; పంచ మహాభూతాల నుండి యీ సకల జగత్తు ఉద్భవించిందని ఉపనిషద్ వాక్యం.

భగవంతుడు సర్వాంతర్యామి. ఆయన ఏ విధంగా అనుభూతిని అనుగ్రహిస్తాడో మనకి తెలియదు. మనం చేయవలసినదల్లా కేవలం ఆశ్రయించి వుండటమే. అదృష్టం కలసి వస్తే చాలు.

కనుక, ఈ నూతన సంవత్సరంలో శ్రీగురుపరమాత్మని మనసారా ప్రార్థిద్దాం. "ప్రభూ! ఈ నూతన సంవత్సరంలో ఇంతవరకూ మేము చేసిన తప్పులన్నీ మీ పాదారవిందాముల ముందు దహనం చేసి, ఇక రాబోయే కాలంలో, సర్వకాల సర్వావస్థల యందు నీ యొక్క నామ కీర్తన, స్మరణ, నీ యొక్క తత్వవిచారణ, తత్వాన్వేషణ, తత్వానుభూతిని ప్రసాదించి, అఖండ ఆయురారోగ్య ఐశ్వర్యములను, అఖండ సుఖ శాంతులను, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు మనందరినీ సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

12-12-1985

శ్రీ బాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఆత్మతత్త్వాన్ని గురించి చెప్పమంటే పండితులు, శాస్త్రజ్ఞులు సామాన్య ప్రజానీకానికి అర్థం కాని భాషలో చెప్పి తికమక పెడ్తారు. దానికి కారణం వారిది కేవలం పుస్తక జ్ఞానమే గాని అనుభవ జ్ఞానం కాదు. వారు కేవలం పొట్టకూటి కోసం తమ విద్యని అమ్ముకుంటారు. దీనికి కారణం ఏమిటో చెప్పగలరా ? ఇంతమంది చదుకున్నవారున్నారు. ఎవరైనా సరే చెప్పవచ్చు. ప్రాపంచిక విషయాల గురించి మాట్లాడమంటే దంచేస్తారు. తత్త్వాన్ని గురించి మాట్లాడమంటే ఎవ్వరూ ఒక్కరైనా మాట్లాడరేమండీ?" అని శ్రీ బాబు ప్రశ్నించారు.



శ్రీ తారకంగారు సమాధానం చెపుతూ 'అజ్ఞానం' అన్నారు. శ్రీ బాబు మాట్లాడుతూ "కేవలం అజ్ఞానమే కాదు. తప్పు. మానవుడికి క్షుద్బాధ అనేది ఒకటి ఉంది. అది లేకపోతే కర్మ చేసి డబ్బు సంపాదించవలసిన అవసరం లేదు. దాని వలన కర్మ చేయవలసి వస్తుంది. మానవుడు తన క్షుద్బాధ తీర్చుకోవటానికి కావలసినంత సంపాదించుకోవచ్చు. తప్పులేదు. కాని అక్కడితో అది ఆగటం లేదు. మానవుడిలో ఆశ అనే కోతి ఆగనివ్వదు. ఆశ ద్వారా సమస్త కర్మములు చేసి పంచమహాపాతకములను, ఉపపాతకములను ఆర్జిస్తున్నాడు. 'అయితే మానవుడికి దీనిని రహితం చేసుకుని విముక్తి పొందే మార్గము లేదా?' అని మీరు ప్రశ్నించవచ్చు. ఉంది.

మానవుడు తనలో ఆశను జనింపచేసే కోతిని, బ్రహ్మజ్ఞాని యొక్క దివ్య చరణారవిందం పైననే నిలపాలి. ఎందువలనంటే బ్రహ్మజ్ఞాని తానెవరో తాను తెలుసుకున్నవాడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము బ్రహ్మపదార్థమునే చూడగలిగినవాడు. ఆశని జయించినవాడు. కాని బ్రహ్మజ్ఞానికి మాత్రం ఎప్పుడూ ఒకదానిపైననే ఉంటుంది ఆశ. తన దివ్య

చరణారవిందములను ఆశ్రయించిన వారి హృదయములో బ్రహ్మ పదార్థమును దర్శించాలి అనే ఆశను చిగురింపచేస్తాడు. బ్రహ్మజ్ఞానిని పరమాత్మని విడదీయటానికి లేదు. దీపాన్ని దీపము యొక్క కాంతిని విడదీయలేము. మధుర పదార్థాన్ని మధురత్వాన్ని వేరుచేయలేము.

అందువలనే పటిక బెల్లాన్ని పట్టుకొన్న చీమ తన ప్రాణాన్నయినా త్యాగం చేయటానికి ఇష్టపడుతుంది కాని ఆ మధుర పదార్థాన్ని వదలదు. కాని బ్రహ్మజ్ఞానిని ఆశ్రయించిన మానవుడు తన దేహాన్ని త్యాగం చేయవలసిన అవసరం లేదు. తనలోని గుణాలను త్యాగం చేస్తే మధురత్వాన్ని అందుకోగలుగుతాడు. ఇది మాత్రం సత్యం" అన్నారు.



భాస్కరా! సూర్యభగవానుడా! కొంగ హంసలతో కూడిన కొలను యందున్న మాత్రంచేత, ఆ హంస నడకలు కొంగకు ఏ విధంగా వంటబట్టవో ; అలాగే మూఢుడు జ్ఞానముకల వారితో స్నేహముతో సంచరించిననూ, వాడికి మంచివాని నడవడికలు వంటబట్టవు.

- భాస్కర శతకము (శ్లో॥ 100)

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) -సుషుమ్న ప్రసాద

శిశువుకు చెప్పే కథ.

వశిష్ఠ మహర్షి తన ప్రబోధాన్ని కొనసాగిస్తూ, యిలా అన్నారు. "ధీరోదాత్తుడైన ఓ రామచంద్రా! మహర్షి యొక్క మనస్సు బ్రహ్మము కంటె భిన్నమైనది కాదు. జ్ఞానోదయముకాని మనసు అజ్ఞానమునకు, లోపాలకు తప్పిదాలకు మూలకారణము బ్రహ్మములో అనేక శక్తులు యిమిడివున్నవి. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి, భూమాశక్తి, అకర్తాశక్తి మున్నగునవి, అత్యున్నతమైన పరబ్రహ్మ పరిపూర్ణుడు, లోపరహితుడు, నాశరహితుడు పరబ్రహ్మ వాయువులో చలన శక్తిగా, రాతిలో కఠినత్వంగా అగ్నిలో వేడిగా, ఆకాశంలో ఖాళీగా, నీటిలో ద్రవశక్తిగా గోచరిస్తుంది. పవిత్రులైనవారి హృదయాలు ఆత్మానంద అనుభూతిని పొందుతాయి. బ్రహ్మ యొక్క మహిమ యోగులలో గోచరిస్తుంది. బ్రహ్మ సృజనాత్మక శక్తి సృష్టిలో ప్రస్ఫుటమవుతుంది.



బ్రహ్మ వినాశ శక్తి కల్పాంతమందు, విశ్వ ప్రళయంగా విజృంభిస్తుంది. చెట్టువిత్తనములో యిమిడివున్నట్లు సర్వమూ బ్రహ్మములో యిమిడి ఉన్నది. తనయెక్క మాయాశక్తితో ఏకము, అఖండమైన బ్రహ్మ, అనేకంగా గోచరిస్తుంది. ఆలోచనలద్వారా బ్రహ్మము మనసుగా స్ఫురిస్తుంది. అవిద్య వలన అఖండమైన పరమాత్మను, ఉపాధి ద్వారా జీవాత్మగా భావిస్తున్నాము. ఏవిధంగా మాయోపాధి వలన ఈశ్వరుడు, నిక్షేపశక్తి వలన విశ్వముగా ప్రస్ఫుటమవుతున్నాయో, అలాగే పరమాత్మ ఉపాధికి పరిమితియై జీవాత్మగా గోచరిస్తున్నాడు.

బంధము, ముక్తి అనేవి అజ్ఞానము ద్వారా కలిగిన భావాలు మాత్రమే. ఆత్మ బంధమునకు లోనైనదనుకోవటం కేవలం భ్రమ. ఆత్మ యెప్పుడూ స్వేచ్ఛతో బంధరహితమై ఉన్నది. బంధరహితమైన ఆత్మ బంధవిముక్తికి కృషి చేయటమనేది అవివేకము. ఈజగత్తులో

అజ్ఞానమనే ఊబిలో కూరుకుపోయిన మానవులకు, ప్రపంచము వాస్తవముగా, సత్యముగా గోచరిస్తుంది. ఇక్కడ ఒక పసి బాలునకు తల్లి వాళ్ళమ్మమ్మ చెప్పిన చిత్రమైన కధను వివరిస్తుంది. ఆ కథ యీ ప్రపంచము యొక్క అనాస్తికతకు అద్దము పడుతుంది.

అప్పుడు శ్రీరామచంద్రుడు వశిష్ఠ మహర్షితో "పూజ్యులైన ఓగురుదేవా! నేనాబాల కధను వినటానికి చాలా ఉత్సాహంగా వున్నాను. తమరు వెంటనే, ఆ కధను వివరించ వలసినదని వేడుకొన్నాడు."

వెంటనే వశిష్ఠ మహర్షి, ఆ కధను చెప్పటం మొదలెట్టారు. అనగనగా నొక పసిబాలుడు తన తల్లిని సరదాగా, వినోదంగా వుండే కధను వివరించమన్నాడు. వెంటనే ఆ తల్లి ఒక పురాణ కధను వివరించటం ప్రారంభించింది.

"చాలాకాలం క్రిందట, ముగ్గురు రాకుమారులు శూన్యమనే నగరంలో నివసిస్తున్నారు. వారు చాలా ఉదాత్తులు, గుణవంతులు, ధైర్యవంతులు. వారు ముగ్గురులో యిరువురు యెప్పుడూ పుట్టనేలేదు. మూడవ రాకుమారుడెప్పుడూ తల్లి గర్భకోశములో ప్రవేశించ లేదు. వారు ముగ్గురు ప్రయాణమై బయలు దేరి, ఆకాశ వనంలో విశ్రాంతి తీసుకొన్నారు. వారక్కడ వివిధరకాలైన ఫలాలను భక్షించి, తమ ప్రయాణాన్ని ఊర్ధ్వ దిశగా కొనసాగించారు. అలా చాలా దూరం ప్రయాణం చేసిన తరువాత, మిట్ట మధ్యాహ్న సమయంలో ఉధృతమైన అలలతో ఉరవడిగా ప్రవహించే, త్రివేణి సంగమము దగ్గరకు వచ్చారు.

ఈ మూడు నదుల్లోరెండు నదుల్లో నీరే లేదు. మూడవనదిలో తెల్లని యిసుక మాత్రం ఉన్నది. ఆ చివరి నదిలో ముగ్గురు రాజకుమారులు కేరింతలు కొడుతూ చాలాసేపు స్నానంచేసి పాలలా మధురంగా ఉండే నీటిని త్రాగి, సంధ్యా సమయమునకు, అప్పటి వరకు ఉనికిలేని ఒక పట్నం చేరుకొని, అక్కడ మూడు గృహాలు నిర్మించారు. ఒక ఇంటికి పునాది లేదు. రెండవ గృహమునకు గోడలులేవు. మూడవ యింటికి కప్పుకాని, గోడలుకాని లేవు. ఆ ముప్పురు రాకుమారులు, ఆకాశంలోని అదృశ్య నగరంలో వారు నిర్మించుకొన్న అందమైన గృహాల్లో, యెంతో సౌఖ్యంగా జీవించారు.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2014**

06 గురు రథసప్తమి.

8, 9,10,11,12 తేదీలలో పెదనిండ్రకొలనులో సత్సంగములు, భక్త సమారాధన జరుపబడును.

10 సోమ భీష్మ ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం (పెద నిండ్ర కొలనుశాఖలో శ్రీ సద్గురుదేవుల దివ్యమంగళమూర్తి దశమవార్షికోత్సవ ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన)

14 శుక్ర మాఘపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

20 - 22 వరకు కట్టమూరులో సత్సంగసమావేశములు.

24 సోమ శ్రీగురుదశమి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

27 గురు మహాశివరాత్రి (మాస శివరాత్రి) తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీసద్గురుదేవులకు రుద్ర నమకచమక సహితంగా మహాభిషేకం. 4గం.లకు మహాన్యాసం, 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 7-30 సాముహిక శివాభిషేకాలు, ఉదయం 11గం. శ్రీరామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్తసమారాధన, రాత్రి 7గం. శ్రీ మహాకాళికాపరమేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి వారి సాముహిక లీలాకళ్యాణము, అనంతరం శ్రీకళ్యాణ మూర్తుల నగరోత్సవం.

**మార్చి 2014**

3 సోమ శ్రీలలితానందసరస్వతీస్వామిని ఆరాధన.

5 నుండి 12 వరకు నిడమర్రు గ్రామంలో సత్సంగ సమావేశాలు.

16 ఆది పూర్ణిమ హోలీ. శ్రీసద్గురుపాదపూజ

26 బుధ శ్రీగురుదశమి సత్సంగ సమావేశము, శ్రీసద్గురుపాదపూజ

29 శని మాసశివరాత్రి

30 ఆది అమావాస్య

31 సోమ శ్రీ జయ నామ సంవత్సర ఉగాది. ఉదయం 11 గం.లకు పంచాంగ శ్రవణం. శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

# పంచ 'వ' కారాలు

-ఓం కాళి

జీవితంలో మానవుడు బాగుపడాలంటే 5 'వ' కారాలను పరిశుద్ధంగా ఉంచుకోవాలి. అవి 1. వస్త్రం 2. వపుః (శరీరం) 3. వాక్కు 4. విద్య 5 వినయం ఈ ఐదింటిని మానవుడు పవిత్రంగా వుంచుకొంటే తనజీవిత గమ్యాన్ని చేరుకో గలుగుతాడు.

వ్యవహారార్థం ప్రాపంచిక విద్యలను నేర్చుకొన్నా, ఆధ్యాత్మిక విద్య తప్పని సరిగా నేర్చుకోవాలి. శ్రీగురుదేవుల సన్నిధిలో దాని గురించి మెలుకువలను తెలుసుకొని ఆచరణలోపెట్టి తద్వారా అనుభూతిని పొందాలి.

ఆధ్యాత్మిక సాధనలు చేయవలెనన్న శరీరం యొక్క ఆరోగ్యాన్ని జాగ్రత్తగా రక్షించుకోవాలి మిత ఆహారం, సాత్వికాహారం, తీసుకోవాలి. సాధకుడు ఇతరులతో సత్యంగాను, ప్రియంగాను మాట్లాడాలి ఎవరి మనస్సును నొప్పించ కూడదు. మిత భాషణం అలవరుచుకోవాలి. వాక్కు, జిహ్వలపై నిఘా ఉంచాలి.

వివేకవంతుడు, బాహ్యశుద్ధిని అంతఃశుద్ధిని రెండిటిని పొందుటకు ప్రయత్నించాలి. స్నానాదుల ద్వారా శరీరాన్ని శుచిగా వుంచుకోవాలి. శుద్ధ వస్త్రమునే ధరించాలి. బాహ్య, అంతర శుద్ధి కలిగి ఉంటే మానవుడు ఈ జీవితమందే పరమశాంతిని అనుభవించ గలుగుతాడు.

ఉత్తముడైనవాడు అహంకారాన్ని పరిత్యజించి తానెంత గొప్పవాడైనను విర్రవీగక అంతయు భగవదనుగ్రహమని భావించుచు వినయ విధేయతలు కలిగి ప్రవర్తించాలి. తన హృదయమందు గర్వమునకు ఏమాత్రము చోటీయరాదు. ఈ విధముగా పంచ 'వ' కారములను పరిశుద్ధముగా ఉంచుకొన్నవాడు అచిరకాలంలోనే పరమశాంతిని, సుఖాన్ని, దైవకృపను పొంది, ఆత్మానుభూతిని పొందగల్గుతాడు. అందుకే;-

"వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ
వకారైః పంచభిర్హీనః వాసవోపి న పూజ్యతే"

వస్త్రం, వపుః, వాక్కు, విద్య, వినయం అనే ఈఐదు వకారహీనుడు ఇంద్రుడైనా పూజింప బడడు అని పెద్దలవాక్కు.

" ఓం తత్ సత్ ఓం "

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

శాస్త్రవాసన, లోకవాసన, దేహవాసన రహితం కావాలి అంటారు కదా! మరి శాస్త్రాధ్యయనం దోషమా? అన్న ప్రశ్నకు సమాధానంగా సద్గురు దేవులు బోధ చేస్తూ "భగవద్గీతా పారాయణ చేయటం ఉన్నత సంస్కారానికి నిదర్శనం. దానిని ఎవరూ తప్పు పట్టరు. భగవద్గీతలోని ఏ ఒక్క శ్లోకం మనసులో నిలిచినా, వారు శోక మోహాలనుంచి దూరం అవుతారు. అంతేకాదు వారికి నిర్భయత్వాన్ని బోధిస్తుంది. భయస్థులు క్షణక్షణం పుడుతూ చస్తూ ఉంటారు.



మానవుడి పతనానికి అహంకారమే కారణం. అది యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని దూరం చేస్తుంది. అటువంటి వ్యక్తికి ఏది ధర్మం, ఏది అధర్మం అనే విషయాన్ని మరచి ప్రవర్తిస్తాడు. పొరపాటు చేయవచ్చు. కాని దాన్ని పునరావృతం కాకుండా చూసుకున్నవాడు ధన్యుడు. వినయవిధేయతలుగల వ్యక్తి పెద్దల సమక్షంలో తలవంచుతాడు. శాస్త్రవాసన అహంకారానికి కారణం అవుతుంది. గ్రంథాలు అధ్యయనం చేసిఉండవచ్చు, శాస్త్ర విషయాలన్నీ అవగాహన చేసిఉండవచ్చు, వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు చదివి వుండవచ్చు, కాని అందులో ఏ ఒక్క శ్లోకమైనా మనస్సులో పదిలపరచిన వాడు ధన్యుడు. ఆచరించిన పండితుడు తనను ఆశ్రయించినవారికి దానిలోని అమృతాన్ని అందచేయవచ్చు. దోషం లేదు.

అలాకాకుండా నేను చదువుకున్నవాడిని, విద్యావంతుడను, పండితుడను అనే అహంకారంతో నీ శాస్త్రజ్ఞానాన్ని యితరులకు అందజేయాలనుకోవటమే శాస్త్రవాసన. అటువంటి వ్యక్తి తాను నమ్మిన సిద్ధాంతమే యదార్థమని సద్గురుమూర్తితో కూడా తర్కానికి దిగుతాడు.

వినయవిధేయతలు కలిగిన శిష్యుడే సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రుడు. అహంకారం రహితమవనిదే జ్ఞానం నిలవదు. ఆత్మానాత్మ వివేకం కలగాలంటే శుద్ధమైన బుద్ధి కావాలి. అద్దంలో నీ ప్రతిబింబం సరిగా కనబడాలంటే అద్దం ఉపరితలం పరిశుభ్రంగా ఉండాలి. సర్వ వ్యాపకమైన ఆత్మవస్తువుని గుర్తించటానికి శుద్ధమైన బుద్ధి కావాలి. శాస్త్ర వాసన, అహంకారము ఆత్మదర్శనం పొందటానికి సాధకునికి అవరోధమే. శాస్త్రజ్ఞానాన్ని సద్గురుమూర్తి బోధతో అన్వయించుకుంటే ఆత్మానుభూతి సుగమం అవుతుంది అన్నది సద్గురుమూర్తి సందేశంగా తీసుకుందాం.

# ఆనందమానంద మాయె!

-పెనుమాక నాగేశ్వర రావు

ఆనంద మానందమాయె
ఆనంద నిలయుని దర్శనమాయె ॥ఆన॥

కమనీయా కృతి గాంచిన కన్నులు మావాయె
పురాణ పురుషుని పూజించిన కరములు మావాయె ॥ఆన॥

భక్తవత్సలుని వాత్సల్యము మాదాయె
లోక బాంధవుని బాంధవ్యము మాదాయె
ఆ మాధుర్యము మాదాయె ॥ఆన॥

ప్రణవ స్వరూపుని శరణము పొందిన శుభయోగము మాదాయె
ఆచార్యదేవుని అర్చించిన జన్మలు మావాయె
మా జన్మలు ధన్యమాయె ॥ఆన॥

శ్రీనాధు వర్ణించిన జిహ్వలు మావాయె
భజగోవిందుని భజియించిన భాగ్యము మాదాయె ॥ఆన॥

గురుపాద సన్నిధి మాదాయె
ఆ వెలలేని పెన్నిధి మాదాయె
బృందావన చంద్రుని ప్రేమంతయు మాదాయె
కాళీప్రసాదుని కరుణంతయు మాదాయె ॥ఆన॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

గత సంచిక తరువాయి

– సుశీలా ప్రసాద

ఇక్కడ నా సంగతి చెప్పాలి. మధురానగర శివారులో మాకు పెద్ద భవనం ఉంది. అంటుమామిడి తోటలు, కొబ్బరి, అరటి తోటలు ఉన్నాయి, మాకు పిల్లలు లేరు. బిడ్డలని ప్రసాదించమని దైవానికెన్నో మొక్కులు మొక్కుకున్నాను. అలాంటి వేళ యీబిడ్డ దొరకటం మా అదృష్టంగా భావించాము. రెండు రోజులు దిగులుపడి ఏడ్చాడు, కాని నా భార్య అల్లారు ముద్దుగా అమితమైన ప్రేమతో కంటికి రెప్పలాగ వాడిని పెంచుకుంటూ వచ్చింది. బిడ్డ మాకు అలవాటు పడిపోయాడు. వాడు వచ్చిన వేళావిశేషం వలన నా సంపద బాగా పెరిగింది. ఇంకా చెప్పుకోవలసింది నాభార్య గర్భవతి అయి మగ బిడ్డకన్నది. అంత మాత్రాన వాడిని నిర్లక్ష్యంచెయ్యక, ఇద్దర్నీ సమంగా పెంచుకుంటూ వచ్చాము. మా ఆనందానికి అవధుల్లేకుండా కాలం గడచింది. ఇలా ఉండగా యీమధ్య జరిగిన విచిత్రం చెప్పాలి,



నాకు రోజూ కలలో ఒక చిన్న బాలుడు కనిపిస్తూ మేము పెంచుకున్న మా పెద్దబ్బాయిని చూపిస్తూ “ వీనిని, అతని తల్లి తండ్రులకి అప్పగించు నాయనా! నాకు పెంచిన పుణ్యమేగాక బిడ్డ ఎడ బాటుతో కుమిలి పోతున్న వాని తల్లితండ్రుల బాధని తీర్చిన గొప్ప పణ్యం కూడా దక్కుతుంది” అని చెప్తూ వచ్చాడు. వాని తల్లి తండ్రులు ఎవరోనని నాకు సందేహం కలిగితే తిరిగి కలలో మీ ఇద్దర్నీ చూపించి మీరుండే యీ ఇంటిని యీవ్రేపల్లెకు దారిని కూడా చూపించాడయ్యా! వాని మాటప్రకారం మీబిడ్డను మీ దగ్గరకి మీ ఇంటికి చేర్చాను.

ఆ బాలుని తేజస్సుని చూసి, మాటల తీయదనాన్ని విని నేను

పరవశించి పోయానయ్యా! నేను నమ్మిన దైవమే ఆరూపంలో కనిపంచాడు అనుకున్నాను. ఇదిగో మీ బిడ్డ !" శ్రీమంతుని మాటలు వింటూ సింగన్న చుక్కమ్మ తాము వింటున్నది, చూస్తున్నది అంతా కలా నిజమా అనుకోసాగారు.

ఆ శ్రీమంతుడు తనకి కలలో కనిపించిన చిన్నారి బాలుని మురిసిపోతూ వర్ణిస్తుంటే వింటూ సింగన్న తన్మయుడై పోయాడు. ఆ వర్ణన సరిగా నందబాలుని దివ్య రూపానికి సరిపోయింది. తమ కుమారుని తమకి తిరిగి యివ్వమని వేడుకున్నప్పుడు ఆ లీలా కిశోరుని అమిత కృపకు పాత్రులై తమ బిడ్డను తిరిగి పొందిన తామెంత భాగ్యవంతులమని మహానందం పొందుతున్న సింగన్న దంపతులు కన్నయ్యను మరీ మరీ మొక్కుతూ ఉన్నవేళ.

"ఎందుకో ఊరికే నవ్వుకుంటున్నావు కన్నా!" అని యశోద తల్లి తనయుని అడిగినప్పుడు మధురంగా నవ్వుతూ ఒక మంచి పనిచేసి నందుకు ఆనందంగా ఉందమ్మా అన్నాడు నల్లనయ్య.

| | |
|---|---|
| స॥ | వాల్మీకి మధురమౌ వాక్య రచనలన్ని<br>సద్గురు కరుణచే చదువుచుంటి !<br>వ్యాస సంఘటితమౌ బహు పురాణములను<br>సద్గురు కరుణచే చదువుచుంటి !<br>కాళిదాసుని మహాకావ్యమ్ములన్నచో<br>సద్గురు కరుణచే చదువుచుంటి !<br>భట్ట బాణుని వచోభావ గుంఫములన్ని<br>సద్గురు కరుణచే చదువుచుంటి ! |
| గీ॥ | భారవి, మయూర, చోర, మురారి, హర్ష<br>ఘటిత నానార్థ నిధులైన కావ్యములను<br>సద్గురులకడన్ చక్కగా చదువుచుంటి!<br>శ్రద్ధతో విద్య, మీదయన్ సాగుచుండె! |

(గత సంచిక తరువాయి)

# సర్వము నీ దయ

- సుశీలా ప్రసాద

రాజ భటులవెనుక నేరస్తునిలాగా నడచిపోతున్నాడు. మునుపు యుద్ధాల నుంచి విజయలక్ష్మిని చేపట్టి మహావైభవంగా ఏబాట మీదుగా రాజధానికి తిరిగి వచ్చాడో అద్వితీయ బలోపేతుడు, అభిమానధనుడు, శౌర్యనిధి అయిన శ్రీవర్ధనుడు నేడు అదే బాటపైన నిస్సహాయుడిగా బందు మిత్ర విహీనుడిగా బిక్షకుని వలె నడుస్తున్నాడు. ఆయన అదృష్టం ఎందుచేత తరిగి పోయుంది? నగరం వెలుపలికి రాగానే భటులు ఆగారు. " నగర సరిహద్దులను దాటించి నిన్ను స్వేచ్ఛగా విడిచి రమ్మని మాకు ప్రభువు ఆజ్ఞ ఇచ్చారు. నీవు సరైన మానసిక స్థితికి తిరిగి వచ్చేదాకా నగరంలో కనబడ రాదని శ్రీ చక్రవర్తి ఆజ్ఞ " ఆ విధంగా శ్రీవర్ధనునుని హెచ్చరించి చెప్పి ఆ భటులు తిరిగి పోయారు.

శ్రీవర్ధనుడు నెమ్మదిగా పరధ్యానంగా నడవసాగాడు. దారిలో ఉన్న ప్రకృతి అందాలను కూడా గమనించకపోతున్న రాజు ఒక సరస్సు గట్టుకి చేరుకోగానే మెరుపువలె ఆ ప్రదేశాన్ని గుర్తించాడు. ఆ కొలని గట్టునే శాండిల్యమహర్షి ఆశ్రమం ఉన్నది! యవ్వనంలో పాలకుడిగా తానిప్పుడు నడచి వచ్చిన దారినేవచ్చి మహర్షి దర్శనం చేసుకునేవాడు. ఆమహాత్ముని ఉపదేశాలు వింటూ, తన సందేహాలను సమస్యలనూ తీర్చుకునేవాడు.

వెంటనే శ్రీవర్ధనుడు తనకి చిరపరిచితమైన ఆశ్రమ ద్వారంలో నిలచి మహర్షి తనను గర్తించగలరా అని వితర్కించు కుంటూ మెల్లిగా తలుపు తట్ట సాగాడు. " క్షణమాగు నాయనా ! నీవిక్కడికి ఏమి తీసుకు వచ్చావో ముందు నాకు చెప్పు! అంటూ లోపలి నుంచి ఒక దయాపూరిత కంఠ స్వరం వినవచ్చింది. " గురుదేవా! నన్ను చూడండి! మునుపు తరచు మిమ్మల్ని దర్శించే శ్రీవర్ధన చక్రవర్తిని నేను !" అంటూ నీరస కంఠంతో జవాబు ఇచ్చాడు. మహర్షి కంఠ స్వరం తీవ్రంగా వినబడింది. "పిచ్చివాడు పలికే అసత్య ప్రలాపాలను నేను విననను. వినయవంతులు, పవిత్రహృదయులు అయిన వ్యక్తులతో మాత్రమే నేను భాషించగలను, నా ఆశ్రమంలో నుంచి నీకు రక్షణ రాదు."

శ్రీవర్ధనుని హృదయం వేయి వక్కలైంది. యవ్వనంలో తనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి యిష్టాగోష్టి జరిపిన మహర్షి యీరోజు తనను తృణీకరించి వేయడానికి కారణమేమిటి? ఆనాటి భగవద్భక్తి నిర్మల హృదయమూ నేడు లోపించటమేనని శ్రీవర్ధనునికి హటాత్తుగా స్ఫురించింది. ఈ ఆలోచనలో శ్రీవర్ధనుని మనస్సులో మార్పు రాసాగింది. అమాయకునిగా, నిగర్విగా, వినయ విధేయతలతో మహర్షిని దర్శించి దైవ చింతనలో నిమగ్నుడౌతూ ఉండేవాడు. క్రమ క్రమంగా తనకు శ్రీ తో బాటు స్వార్ధపరత్వమూ గర్వము వృద్ధి కావటంతో ఆశ్రమానికి రాకపోకలను తగ్గించి వేసి కేవలం రాజ్య భోగాలలో మునిగి తేలుతూ, భగవన్నామ స్మరణమే మరచి పోయాడు. మరీ ఈ మధ్య కాలంలో జ్ఞాన కాంక్ష, దైవ భక్తి నశించి పోయి స్వార్ధం, అహంకారం మాత్రమే మిగిలాయి. ఆ ధన, మదాంధ సమయంలో భగవంతుడు ఒకడున్నాడనే విషయమే జ్ఞప్తికిరాలేదు. చివరికి ఇన్ని ఆపదలు సంభవించినా కూడా ఈక్షణం వరకూ పరమేశ్వరుని ఒకసారి అయినా తలచని తన పాపానికి ప్రాయశ్చిత్తమే ముంది? ప్రస్తుత పరిస్థితులే భగవంతుడు తనకి విధించిన శిక్షకాబోలు !

శ్రీవర్ధనుడు పశ్చాత్తాపంతో దహించుకుపోతూ బిగ్గరగానే రోదించ సాగాడు. కన్నీళ్ళు చెక్కిళ్ళపై నించి ప్రవహించసాగాయి. “ఓ దయామయుడైన పరమేశ్వరా! ప్రజలందరిచేతా నేను నిరసించ బడ్డాను, నేనా విధంగా నీచేత శిక్షించబడ్డానని అందుకు నామూర్ఖాతి శయమే కారణమనీ ఈక్షణం వరకూ గుర్తించలేక పోయాను. గర్వంలో నాకు సాటి రాగలవారెవరని విర్ర వీగాను. అందుకే నన్నీ రీతిగా పతితుణ్ణి చేసి వేశావు. గతంలో నేను చేసిన పొరపాట్లను ఈ పవిత్ర స్థలంలో తలచలేను. నీగుణాలను కీర్తించి నీసన్నిధిని నిలచి ఎన్ని సంవత్సరాలైందో గదా!

-సశేషం

# వర్ణనాతీతం రామనామ మహాత్మ్యం

– వశిష్ఠ

(1980 శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో 5వ రోజు శ్రీబాబు దివ్య బోధామృతము)

జగజ్జనని పూజా మహోత్సవాలలో నేడు అయిదవ రోజు. పంచేంద్రియ తాపాలను హరించి, సుఖ శాంతులను అందించే జగజ్జనని దివ్యనామ స్మరణానందంలో భక్తులందరూ తన్మయత్వం పొంద గలుగుతున్నారు. ఆ తల్లి బ్రహ్మానంద స్వరూపిణి. రూపనామ రహితమైన ఆత్మవస్తువు యొక్క అనంత శక్తి స్వరూపమే జనని. ప్రేమ, కరుణలు ఆమె ప్రతిరూపములు. ఆ తల్లి ప్రేమను చూరగొనటానికే నిరంతరం మానవులు ఆవేదన పడాలి.



వీడు (తనని చూపించుకుంటూ) యీ బాబు ఏమీ చదువుకోనివాడు. ఏమీ తెలియని వాడు. తెలిసినదల్లా 'రామ' అనే రెండక్షరాల మాధుర్యము; మహాత్మ్యము మాత్రమే. అది కూడా శ్రీరామ కటాక్షం వల్లనే.

'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మహామంత్రంలో ప్రధానకరమైన 'రా' అగ్ని బీజము. ఇది అహంకారాన్ని దహించి వేస్తుంది. 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మహామంత్రంలో 'మ' అమృత బీజము. ఇది మమకారాన్ని హరించి, ప్రేమామృతముతో హృదయాన్ని నింపుతుంది. శివ కేశవుల తత్త్వాల అభిన్నత్వాన్ని తనలో నింపుకున్నదే రామనామ తత్త్వమని దానివలన స్పష్టమవుతుంది.

అట్టి రామనామాన్ని జపించిన మానవుడికి ఇహపర సుఖాలన్నీ కరతాలమలకములే. ఆత్మానందమే అతని సొత్తు. త్యాగరాజు రామనామ సంకీర్తన ద్వారా పొందిన అనుభూతి అదే. ఆయన మనసు రామ తత్త్వంలో లయించింది. చీమ నుండి బ్రహ్మ వరకు సర్వత్రా రాముడినే దర్శించ గలిగాడు. కబీర్‌దాసు, రామదాసు, తులసీదాసు యిత్యాది మహాభక్తులంతా అట్టి ఆనందానుభూతినే అనుభవించగలిగారు.

మనం కూడా అట్టి అనుభూతిని పొందగలమా! తప్పక యీ జన్మలోనే యీ చర్మచక్షువులతోనే దర్శించ గలము. అతి తీవ్రమైన ఆవేదన ఒక్కటే అందుకు కావలసినది. ఆ కమనీయాకృతిని కనలేని కన్నులు మాడిపోయిన గాజు బల్బులు.

రాముడిని చూడటానికి నీవు ఎక్కడికో దూరం పోనక్కర్లేదు. నీలోనే ఉన్నాడు రాముడు. అయితే ఆయన కనబడకుండా మన కళ్లకు అహంకార, మమకారములనే రెండు పొరలు అడ్డుగా ఉన్నాయి. పొరలలో ఉన్న బియ్యపు గింజను వడ్లగింజ అంటాము. అది నాటితే మొలకెత్తుతుంది. ఆ పొట్టును తొలగిస్తే, బియ్యపు గింజ బయట పడుతుంది. అది తిరిగి మొలకెత్తేది కాదు. అలాగే అహంకార మమకారాలనే పొరలతో ఉన్న మానవుడు సంకల్పాలు, కోరికలు పెంచుకొని తాను చేసే మంచి చెడులన్నిటికీ తానే కర్తనని భావించి, వాటి ఫలితాలను అనుభవిస్తూ, పుడుతూ. చస్తూ, అనంతమైన అశాంతితో, దుఃఖంలో మునిగి ఉంటాడు. రామనామమనే పరికరంతో శస్త్రచికిత్స చేసి, ఆ రెండు పొరలను తీసివేస్తే అతడు స్వస్వరూపాన్ని దర్శించ గలుగుతాడు.

ఈ దేహం తాను కాదని, అది చేసే పనులకు తాను కర్తను, భోక్తను కానని, కేవలం సాక్షి మాత్రుడనని గ్రహించ గలుగుతాడు. ఇక అతని వలన దేహానికి శ్రమ లేదు. దేహం వలన అతనికి శ్రమ లేదు. అంటే ద్వైతం రహిత మవుతుందన్నమాట.

త్యాగరాజు 96కోట్ల సార్లు రామనామం వ్రాశాడు. రామకోటి వ్రాద్దామని మొదలుపెట్టి, మధ్యలోనే ఆపివేస్తారు కొంతమంది. ఒకవేళ పూర్తిచేసినా, మనసు దానియందు ఉంచరు. రాత్రిళ్ళు దొంగలు రాకుండా ఉండటం కోసం, బిగ్గరగా 'హరేరామ హరేరామ' అని స్మరణ చేస్తూంటారు కొంతమంది. నిజమే. రామనామం భక్తితో, ఏకాగ్రతతో జపిస్తే బయట దొంగలనే కాదు, మన లోపల ఉండి వెలలేని మన జ్ఞాన రత్నాన్నే దొంగిలింపజూసే కామ క్రోధాది షట్శత్రువులను కూడా తరిమివేయ గలదు. కాని నాలుక నామం చేస్తున్నప్పుడు మనస్సు మహీవలయమంతా తిరుగుతుంటే ఫలితాలు రమ్మంటే ఎలా వస్తాయి?

-సశేషం

# చెన్నై, ముంబయి నగరాలలో శ్రీమాతాజీ సత్సంగ విశేషాలు

– రేఖ

21-12-2013 శనివారం

మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగుశాఖ వారు, శుకబ్రహ్మాశ్రమం వారితో కలసి, శ్రీశుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు, శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'భగవద్గీత వర్తమాన సమాజం' అన్న అంశంపై ఒక జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు.

తమిళనాడు గౌరవనీయ గవర్నరు డా. కె. రోశయ్యగారు సదస్సుకు ముఖ్య అతిథిగా వేంచేసి ప్రారంభోత్సవం చేశారు. ప్రొ. జి. కోటేశ్వర ప్రసాద్, రిజిస్ట్రార్, మద్రాస్ విశ్వవిద్యాలయంవారు అధ్యక్షత వహించారు. డా॥ ఎమ్. సంపత్ కుమార్ తెలుగుశాఖ అధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం వారు సభకు విచ్చేసినవారిని ఆహ్వానించారు. శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి, కాళహస్తి, శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, గౌరవ అతిథిగా వ్యవహరించారు. డా॥సముద్రాల లక్ష్మణయ్య తి.తి.దే.వారు పురాణ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్, కీలకోపన్యాసం అందించారు.

పూజ్యయోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీ, శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతులు, నంబూరు వారు విశిష్ఠ అతిథిగా భగవద్గీతయొక్క ప్రాముఖ్యత, శ్రీకృష్ణ భగవానుడు - అర్జునుడు లోకానికి గురుశిష్య న్యాయం ఏ విధంగా అందజేశారో బోధించారు.

తెనాలి, అష్టలక్ష్మీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 దండి నిర్మలానంద గిరి స్వామి ఆశీఃపూర్వక ప్రవచనం అందజేశారు.

మధ్యాహ్నం జరిగిన సమావేశం ఆచార్య దేవళ్ల చిన్ని కృష్ణయ్యగారి ఆధ్వర్యంలో జరిగింది.

వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి విచ్చేసిన ఆచార్యులు, దైనందిన జీవితంలో భగవద్గీత యొక్క ప్రాముఖ్యత - 'భక్తియోగం, 'కర్మయోగం', ఉపమానాలు, గీతామకరందం, భగవద్గీత - జ్ఞానమార్గం, భగవద్గీత - తిరుక్కురళ్ (తమిళ గ్రంథం), కన్నడంలో గీతామకరందం - అనువాద విధానం, మానసిక వికాసం, భారతంలో భగవద్గీత, సామాజిక దృక్పథం అన్న అంశాలమీద ఉపన్యసించారు.

స్వామివారి భారతరత్నాకరము, గీతోపన్యాసములు, గీతా

సందేశము అన్న అంశాలపై వివిధ ఆచార్యులు ప్రసంగం చేశారు.

శ్రీ మాతాజీ గీతా మకరందం యొక్క సారము, గీత బోధించే తత్వముపై తమ భాషణను అందించారు.

సాయంత్రం శ్రీశుకబ్రహ్మాశ్రమము, ప్రముఖ ఆంధ్ర సమితి, చెన్నై శ్రీ సుబ్బనరసయ్య కరుణాంబాళ్ చారిటబల్ ట్రస్ట్, వారిచే శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవ సందర్భంగా PRCC సెంటినరీహాల్ 11, వెంకట్రామన్ స్ట్రీట్, T.నగర్, చెన్నైలో సభ జరిగింది.

ఈ సభకు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారు అధ్యక్షత వహించారు. ఆధ్యాత్మికతలో ఆసక్తిని పెంపొందించుకోవాలని ఉద్బోధన చేశారు. విద్యావిశారద, సంపాదకులు, ప్రముఖ ఆంధ్రపత్రిక శ్రీగోటేటి శ్రీరామారావుగారు స్వాగతోపన్యాసం చేశారు. శిరోమణి డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు విశిష్ఠ ఉపన్యాసం చేశారు. భవగద్గీత గురించి శ్రీస్వామిజీ గురించి, చెన్నై శ్రీరామకృష్ణ మఠం నుంచి విచ్చేసిన పూజ్యశ్రీ బుద్ధిదానంద స్వామీజీ ప్రసంగించారు.

పూజ్యశ్రీ 108దండి నిర్మలానందగిరిస్వామివారు మంచిపనులు చేయడానికి వాయిదా వేయకూడదు అని హెచ్చరికచేశారు. పూజ్యశ్రీ మాతాజీవారు భవగన్నామం యొక్క విశిష్ఠత, భగవద్గీత ధర్మాన్ని ఆచరించమని ఏవిధంగా చెబుతోందో, సత్యాన్ని గుర్తించాలని తమ సందేశాన్ని అందించారు.

### ముంబయిలో సమావేశాలు

డిసెంబర్ 27, 28, 29 తేదీలలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ముంబయి, వర్లీలో శ్రీ మార్కండేయ స్వామివారి ఆలయంలో, అయ్యప్పస్వామి సన్నిధిలో సత్సంగాలు జరిగాయి.

27 -12-2013వ తేదీ సాయంత్రం శ్రీమాతాజీవారిచే ప్రణవ పతాకావిష్కరణ జరిగింది. ఆ సందర్భంగా శ్రీమాతాజీ తమ సందేశాన్ని అందిస్తూ “అ-ఉ-మ అనే అక్షరాల కలయిక ఓంకారం. ఓంకారమే ప్రణవం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల శక్తిని కలిగియున్న ప్రథమ శబ్దం ప్రణవం.

ప్రణవం పంచమహాభూతాల సమ్మేళనమును సూచిస్తుంది. పంచమహాభూతాలలో ఒకటైన ఆకాశానికి గుణం శబ్దం. ఆ శబ్దమే మొట్ట మొదట ప్రణవంగా ఆవిర్భవించింది. ఓంకారం వాయువు ద్వారా ప్రసరిస్తుంది అనటానికి సంకేతం ఈ పతాకం గాలిలో స్వేచ్ఛగా ఎగరడం.

ఓంకారం అగ్నివంటి తేజస్సు కలిగినటువంటిది. జలము (నారములు) సర్వత్రా వ్యాపించివున్నట్లుగా, ప్రణవము భూత, భవిష్యత్, వర్తమానముల యందు, సర్వావస్థల యందు వ్యాపించియున్నది. ఈ పతాకము యొక్క స్తంభమునకు భూమి ఆధారమై యున్నట్లు సమస్త సృష్టికి ప్రణవమే ఆధారమైయున్నది.

ఈ మూడు రోజులూ సాయం సమయంలో భక్తుల పారాయణలు, ప్రార్థనల అనంతరం పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారు, శ్రీసముద్రాల లక్ష్మణయ్యగారు, పూజ్యశ్రీ మాతాజీవారు శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వామివారి గీతోపన్యాసాలు, మార్కండేయ మహర్షి చరిత్ర, గీతామకరందం ఎలా అనుభవించాలో, ధర్మాచరణ, గురుతత్వం, సాధన, ఆచరణ ఎలా ఉండాలి అన్న అంశాలపై బోధను అందించారు.




చెన్నైలో సమావేశము



ముంబయిలోపతాకావిష్కరణ

# రాధాతత్త్వము

- ధర్మపథం నుండి

రాధాదేవిని గురించి భాగవత, విష్ణు పురాణాలలో లేకపోయినా, బ్రహ్మ వైవర్త పురాణం మున్నగు వాటిల్లో విపులంగా ఉంది. ఆమె శ్రీకృష్ణుని మేనత్తని, వయస్సులో పెద్దదని కొందరనుకుంటారు. కొంతమంది మేనత్త కాదని అంటారు. భగవదాజ్ఞ వల్ల గోలోకంలో ఉద్భవించి, శ్రీకృష్ణుని యధావిధిగా వివాహమాడినట్లు బ్రహ్మవైవర్తంలోని శ్రీకృష్ణ ఖండంలో ఉంది. భగవానుడు ఆత్మ అయితే, ఆమె శరీరమట. వారిద్దరికీ భేదం లేదట. రుక్మిణీ, సత్య మొన్నగు మహిషుల కంటె రాధతోటి పొందికయే కృష్ణుడికి ఎక్కువ. 'రాధాకృష్ణ' నామానికి గల ప్రచారం 'రుక్మిణి కృష్ణ'; 'సత్యాకృష్ణ' నామాలకు లేదు. ఆ మాధుర్యమూ లేదు. అసలు అట్టి పదాలు వినబడటమే అరుదు.

రాధ శబ్దానికి ఎన్నో అర్థాలు ఉన్నాయని పురాణాల వల్ల తెలుస్తోంది. ముఖ్యమైనవాటిని మాత్రం యిక్కడ తెలుసుకుందాం. భవిష్యోత్తర పురాణంలో యిలా ఉంది.

సురాసుర మునీంద్రాణాం వాంఛితాం ముక్తిదాం పరామ్।
రేఫో హి కోటి జన్మ కోటిజన్మాఘం। కర్మ భోగం శుభాశుభమ్।
ఆకారో గర్భవాసం చ మృత్యుంచ రోగముత్సృజేతే ।
ధకారో ఆయుషోహాని మాకారో భవబంధనమ్ ।
స్మరణ శ్రవణోక్తిభ్యః ప్రణశ్యన్తి న సంశయః ॥

రాధా శబ్దం ఉచ్చరించినా, విన్నా, స్మరించినా కూడా ఎంతో మేలు కలుగుతుంది. అది దేవతలకు, దానవులకు, మునులకు మోక్షాన్ని అనుగ్రహిస్తుంది. రేఫా - ఆకార, ధకార, ఆకార ములందులో ఉన్నవి కదా. రేఫా - కోట్లకొలది జన్మలలో చేసిన పాపాలను పోగొట్టి జీవునికి శుభాశుభ కర్మల అనుభవాల నుండి విముక్తిని కలిగిస్తుంది. 'ఆ'కారం గర్భవాస, మృత్యు, రోగ భయాలను దూరం చేస్తుంది. 'ధ'కారం జీవిత ప్రమాణాన్ని అంతమొందిస్తుంది. 'ఆ'కారం సంసార బంధాలనుండి తొలగిస్తుంది. మరిన్ని 'ర' నిశ్చల కృష్ణ భక్తిని, సేవను, 'ఆ'కారం ఈశ్వర ప్రాప్తిని కలిగిస్తుంది. 'ధ'కారం భగవంతునితోడి సహవాసాన్నీ, 'ఆ'కారం తేజస్సునూ, యోగశక్తిని మున్నగు వానిని అనుగ్రహిస్తుంది. పై విషయం కూడా ఆ పురాణంలో చెప్పబడింది.

# హితోపదేశము
- సుశీలా ప్రసాద

(1964వ సంవత్సరంలోని శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్యోపదేశము)

నిన్ను నీవు తెలుసుకోగలిగిన నాడు భగవంతుని తెలుసుకో గలుగుతావు. 'నేను' అనేది చెయ్యి, కాలు, మాంసము, రక్తము లేక శరీరంలోని మరేదైనా భాగమా అని ఆలోచించు. 'నేను' అనేది వీటిల్లో ఏదీకాదని నీకే తెలుస్తుంది.

నీరుల్లిపాయ పొరలు వలుస్తున్న కొద్దీ పొరలు వస్తూనే వుంటాయి. చివరకు ఏమీ మిగలదు. ఒలిచినవాడు తప్ప. అలాగే అహంకారం యొక్క స్వరూపమేమిటని పరిశోధించినప్పుడు అది అదృశ్యమైపోతుంది. చివరకు మిగిలేది ఆత్మయే. చిత్స్వరూపమే. అహంకారం నశించగానే భగవంతుడు ప్రత్యక్షమవుతాడు. అహంకారం రెండు రకాలు 1. పక్వము, 2. అపక్వము.

ఇది నా యిల్లు, నా గది, నా కుమారుడు యీ భావము పక్వముగాని అహంకారము. నేను దేవుని సేవకుడను, నేను ఫలానా వారి బిడ్డను, నేను నిత్యముక్తుడను, నేను జ్ఞానస్వరూపుడను అని తలచునట్టిది.

వెలుగునివ్వటం దీపం యొక్క స్వభావము. దాని సహాయంతో కొందరు వంట చేసుకుంటారు; కొందరు దొంగ సంతకాలుచేసి, దొంగ దస్తావేజులు సృష్టిస్తారు; మరికొందరు భాగవతం చదువుతారు. ఇది దీపం యొక్క దోషమా?

అలాగే భగవంతుని దివ్యనామాన్ని జపించి కొందరు ముక్తిని పొందటానికి ప్రయత్నిస్తుంటే, మరి కొందరు తాము తవ్విన కన్నం పారటానికి జపం చేస్తే అది భగవంతుని దోషమా?

పాదుకలు తొడుక్కుని ముళ్ళ మీద నిరపాయంగా నడవ గలవు. ఆధ్యాత్మిక జ్ఞానమనే పాదుకలను ధరించి, తాపములనే ముళ్ళతో కూడిన యీ సంసారమందు సురక్షితంగా సంచరించగలవు.

మొసలికెట్టి ఆయుధము చొరశక్యం కాదు. అతి దట్టమైన చర్మం ఉంటుంది. అలాగే లౌకికులకు ఎంత జ్ఞానబోధ చేసినా వారి తలకెక్కదు. ప్రతి సన్న్యాసి, ప్రతి భక్తుడు కూడా స్త్రీలనందరినీ యోగ్యురాలు అయినా, కాకపోయినా కూడా జగన్మాత స్వరూపంగానే భావించాలి.

సంసార మోహితులైనవారిని ఏదీ మేల్కొలపలేదు. ఈ సంసారంలో ఎన్నో బాధలు, ఎన్నో కష్టాలు విరామం లేకుండా అనుభవిస్తున్నా, వారి మనసు రవంతైనా మారదు. బుద్ధిరాదు. ఒంటెను చూశారా! దానికి ముళ్ళయందు ఆసక్తి. నోటి నుండి రక్తం బుడబుడ కారుతున్నా కూడా అది ముళ్ళను తినటం మానదు. ఈ విధంగా సంసార మోహితులకు ఎంతటి ఆపద సంభవించినా కూడా వారి మనసు మారదు. కొద్ది రోజుల్లోనే వారు ఏ విపత్తు తటస్తంచనివారిలా తిరిగి యధా ప్రకారంగా సంచరిస్తూ ఉంటారు.

ఈశ్వర ప్రాప్తిని కోరుకొనెదవా? నీ గురుదేవుని ఉపదేశ మందు విశ్వాసం కలిగి, ప్రయత్నించి ఆ పరబ్రహ్మాన్ని తెలుసుకుని, అశిధ, ఆనంద స్వరూపుడైన సత్యభగవానుని దయను సంపాదించి నప్పుడు ఆనందం, సుఖం, భోగములు ప్రాప్తిస్తాయి.

సాధారణంగా లోకంలో జనులందరూ 'నాయనా! కుశలమేనా?' అని ప్రశ్నిస్తుంటారు. కాని దినదినం క్షీణించే ఆయుర్దాయం కలిగిన మానవుడికి కుశలమెక్కడిది? అంటే ఆయువుకు 100 సంవత్సరాలు పరిమితి ఉంటుంది. మానవుడికి ఒకొక్క రోజు గడుస్తుంటే, ఆయుషు ఒక్కొక్క రోజు తగ్గిపోతోందని అర్థం. అందువలన కుశలం ఎక్కడిదని అర్థం.

శరీర భ్రమ వలన ఆయువు దినదినం తగ్గుతున్నదనే విషయం మరపుకురావటం కుశలం కాదు. కుశలమనేది తానైన ఆత్మస్వరూపం, ఆత్మ నిత్యత్వమందెల్లప్పుడు ఉండేది అని తెలిసుకోవటమే కుశలము.

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీ బాబూజీమహరాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలలో భాగంగా 23-11-2013 శనివారం రోజున శ్రీమాతాజీవారు అందించిన బోధ సంక్షిప్తంగా)

గురు తత్త్వం అనంతమైనది. గురు తత్త్వం అనేది శాస్త్రం చూడలేక పోయింది. కాలం త్వరగా వెళ్ళిపోతూ వుంటుంది. అందులో మళ్ళా ఎన్నో విఘ్నాలు వస్తూ ఉంటాయి. చెబుతున్నాను కదా! కాలం స్వల్పమైనదని. ఒకే మందు, ఒకే రోగానికి అందరి శరీర తత్త్వానికి పనికి రాదు. అలాగే తరించాలనుకునేటటువంటి సాధకునికి కూడా గురువు ఆశ్రయం లభించినా, వారి వారి మనస్తత్వాన్ని బట్టి వారియొక్క పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి, మహాత్ములు కూడా ఎవరి నడకని ఏవిధంగా మార్చితే, ఏ విధంగా దారి చూపితే, వారి వారి గమ్య స్థానం చేరుకోగలుగుతారో, వారికి ఆ యా మార్గాలను చూపించే గురువులే సమర్థులు.

ప్రసాదాన్ని మనం పదార్థ భావంగా తీసుకుంటే దాని ఫలితాన్ని మనం అంతగా పొందలేము. మహాత్ముల సన్నిధిలో దొరికేది మనకు 'గురు ప్రసాదం'. అది నా గురుదేవులు నన్ను అనుగ్రహించి ప్రసాదించినటువంటిది. ఆ ప్రసాదం కూడా వారి దృష్టి ప్రసరించినటు వంటిది కావచ్చు, వారి అనుగ్రహం ప్రసరించినటు వంటిది కావచ్చు. గురుదేవులు మనకు అనుగ్రహించేటటువంటిది ఆ ప్రసాద రూపంలో రావచ్చు, లేదా తీర్థ రూపంలో రావచ్చు. లేదా బోధామృతం ద్వారా రావచ్చు. ఒక సౌంజ్ఞ ఉంటుంది. ఒక్కొక్కసారి ఒక సూచన యిస్తారు. అప్పుడు ఆలోచన ఎక్కడకి వెళ్ళిపోతుందంటే, యిదివరకు ఎక్కడా అటువంటి అనుభూతిని పొంది ఉండం. ఈ ప్రపంచంలో మనది అనుకున్నది ఏదీ కూడా అటువంటి అనుభూతిని యిచ్చి ఉండదు.

మనకు జ్ఞానేంద్రియాలు ఐదు ఉన్నాయి. ఆ అయిదింటిని కూడా మనం గమనించవలసినదే. కర్మేంద్రియాల ద్వారా కేవలం కర్మని ఆచరిస్తాము. జ్ఞానేంద్రియాల ద్వారా బయట విషయాలను వినటం, కనటం, తినటం, స్పర్శ, వాసనల ద్వారా గ్రహింపు

సర్వావస్థలయందు ముఖ్యంగా గుర్వారాధన అనేసరికి రోమాంచితం అవుతోంది. ఎందుకంటే శరీరం ఉన్నప్పటికీ అభిన్నత్వాన్ని అనుభవింప జేసేదే ఆరాధన. (ఎవరిదో అయితే ఆరాధన అనిపించుకోదు. పూజ అవుతుంది.) తానెవరో తనకు గుర్తింపజేసేదే ఆరాధన. దానియందు బాగా అనురక్తి, అనుభూతి కలుగజేసేదే ఆరాధన.

ఇంద్రియ శక్తి వేరుగా వుంది. ఇంద్రియాలు విడిగా కనిపిస్తాయి. ఇంద్రియ శక్తి అవ్యక్తంగా ఉండి అనంతమైనవాటిని అనుభవిస్తోంది. అది ఎవరి శక్తి? మనం అందరిలాగే పుట్టి, పెరిగినప్పటికీ యింత అనుభూతి ప్రసాదితమైనదంటే కేవలం గురుకృపా కటాక్షమే. గురువును ఆశ్రయించకపోతే కొట్టుకు పోవలసినదే. గురుదేవుల కరుణ మంగళప్రదమైనది. వారి దృష్టి చేత, వారి వాక్కులు వినటంచేత, దానిని ఆచరించటం చేత సర్వ సంశయాలు రహితమైపోతాయి. ఎవరి దగ్గర చెప్పుకుంటే ఆవేదన పోతుందో వారిదగ్గరే చెప్పుకోవాలి.

సామాన్యంగా ప్రపంచంలో దొరికేవి శ్రద్ధ పెడితే సంపాదించ వచ్చు. ప్రజానీకం అటువంటివి కోరుకుంటున్నారు. ఆవేదన, సాధన ఉండాలి. గురుదేవులు అనుగ్రహిస్తే జన్మజన్మార్జిత కర్మలు నశిస్తాయి. అన్నీ నీచ జన్మలు ఎత్తి ఎత్తి పుణ్యం ఆర్జించి, మహాత్ములను సమాశ్రయించటంతో యీ మానవ జన్మ లభించిందో, దీన్ని కూడా మనం వృధా చేసుకుంటున్నాము. జీవితం వ్యర్థమైపోతోంది. వట్టి చేతులతో మట్టి పాలు అవుతున్నాము. ఈ జీవితం యిలాగే వెళ్ళిపోతోంది.

ఆవేదన కావాలి. ఆవేదనలో సాధన ఉంది. ఆరాటం కావాలి. ఈ జన్మకు కారణమైన కర్మ మనలను ఏం చేస్తుంది? నాకే జన్మనైనా రానివ్వండి. నాకేల భయం? నా ప్రభువు ఉండగా.

గురుదేవుల అనుగ్రహానికి పాత్రులైన వారికి ఏలోటూ వుండదు. శ్రీగురుదేవుల పరమానుగ్రహం మనందరిపై వర్షించుగాక! గురుపాదుకలు సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# శ్రీ బాబూజీతో అనుభవాలు

-వి. సీతామహాలక్ష్మి

1962సం॥లో శ్రీబాబూజీ రాజమండ్రిలో నాగులమల్లి సుబ్రహ్మణ్యం గారింట్లో శ్రీకాళీజయంతుత్సవాలు జరుపుతున్నారు. అప్పటికి నాకు పెళ్ళి అయిన కొత్తరోజులు. మా అత్తగారు, మా వారు నన్ను కూడా తీసుకువచ్చి శ్రీబాబు దర్శనం చేయించారు. నాకు కొత్త కాబట్టి పూజలు, నమస్కారాలు అంటే పెద్దగా ఆసక్తి ఉండేదికాదు. అయినప్పటికి వాళ్ళతో రోజూ రాత్రి వచ్చి నమస్కారాలు, ఉపన్యాసం అయ్యేసరికి రాత్రి 1గంట దాటేది. మళ్ళీ తిరిగి రాత్రికి యింటికి వచ్చేసేవాళ్ళం. అప్పటిలో నెల, రెండు నెలలపాటు పూజలు జరిగేవి. ముంజవరపుకొట్టులో శివరాత్రికి సహస్రఘటాభిషేకానికి కూడా వెళ్ళేవాళ్ళం. ఇలా నాలుగు సంవత్సరాలు జరిగాయి.

ఇంకా నాకు సంతానం లేకపోవటంతో, మా అత్తగారు శ్రీబాబుతో చెప్పి ఏమైనా దీక్ష యిస్తే బాగుంటుందని అనుకునేవారు. మా బంధువులు సంతానయోగం ఉందోలేదో హస్తసాముద్రికం చూపించారు. నాకు సంతానంయోగం లేదని, ఉన్నా మగపిల్లలు పుట్టరని, ఆడపిల్లలే పుడతారని చెప్పటంతో మా అత్తగారికి దిగులు ఎక్కువైంది. పెద్దలంతా అంటూఉంటే నాకు తెలియకుండానే నాకు కూడా దిగులు పట్టుకుంది. ఒకసారి శ్రీబాబు తీర్థం యిస్తుంటే లైనులో ఉన్నాను. ఆయనచేతిలో కొన్ని పూవ్వులు ఉన్నాయి. నేను మనసులో ఆ పువ్వు నాకు యిస్తే నాకు పిల్లలు పుడతారు లేకపోతే లేదు అని మనసులో అనుకుని తీర్థానికి చేయి చాచాను. శ్రీబాబు తీర్థం యిచ్చిన తరువాత చేతిలో పువ్వు పెట్టారు. అప్పుడు మనసు చాలా సంతోషించింది. ఈ విషయం నేను ఎవరికీ చెప్పలేదు.

ముంజవరపుకొట్టులో అభిషేకానంతరం శ్రీబాబు అంతర్వేది సముద్ర స్నానానికి తీసుకెళ్ళారు. శ్రీనరసింహస్వామి ఆలయానికి వెళ్ళాము. గుడిచుట్టు ప్రదక్షిణ చేస్తుంటే, సంతానస్వామి గోపాల స్వామి గుడి చూపిస్తూ శ్రీబాబు నా వంక చూస్తూ “సంతానం కావాలనుకున్న వాళ్ళు ఈ స్వామికి దండం పెట్టుకోండి తప్పక సంతానం కలుగుతుంది” అన్నారు.

ఇలా కొన్నిరోజులు గడిచిన తరువాత మాకు శివదీక్ష యిచ్చారు. రాజమండ్రిలో మార్కండేయస్వామి ఆలయానికి ప్రదక్షిణాలు చేయ సంకల్పించాము. గుడిలో ఆవును దూడను కూడా కట్టివేశారు. కాబట్టి గో దీక్షకూడ కలసి వచ్చింది. దీక్ష ఫలించింది. నెల తప్పాను. శ్రీబాబుకు శుభవార్త చెప్పాలని వచ్చాము. ఆ టైమ్‌లో లేడీ డాక్టరుగారు ఉన్నారు అక్కడ. శ్రీబాబు ఆవిడతో పరీక్ష చేయించుకుని కొన్ని జాగ్రతలు పాటించ మన్నారు. 'మృతవంధ్యసంజీవిని' అనే ఆయుర్వేద మందు కూడా యిచ్చి వాడమని చెప్పారు.

1968 ఏప్రిల్ 18న మగపిల్లవాడు జన్మించాడు. 5వ నెల వచ్చేసరికి శ్రీబాబు గుంటూరులో ఉన్నారని తెలిసి, మేము పిల్లవాడిని తీసుకువచ్చి బాబుకు చూపించాము. శ్రీబాబు "అమ్మా! నీ కోరిక తీరిందా?" అన్నారు. నాకు శ్రీబాబుకు తప్ప ఎవరికీ అర్థం కాలేదు. దీనిబట్టి నుదుటి వ్రాతను చెరిపి, తిరిగి రాసే అర్హత, సమర్థత గురుదేవులకు తప్ప ఎవరికి ఉంటుంది? అనిపించింది. గుండుగొలనులో దేవీనవరాత్రి ఉత్సవాలలో శ్రీబాబు మా పిల్లవాడికి నామకరణం, అన్న ప్రాసన చేశారు. "ఏం పేరు పెట్టదలచుకున్నారు?" అని శ్రీబాబు అడిగారు. 'మీ పేరే పెట్టండి' అన్నాము. మా చిరంజీవికి 'భావనారాయణ కాళీప్రసాద్' అని పెట్టారు.

రెండవకాన్పులో ఆడపిల్ల పుట్టింది. అప్పటికి ఆశ్రమం కట్టారు. పాపను తీసుకువచ్చాం. బాబు ఈ పాపకు 'కాళీమాత' అని పెట్టారు. మా వారికి తరువాత కడపజిల్లాలో ఉద్యోగం రావటం వలన, తరచుగా శ్రీబాబు దర్శనానికి రాలేకపోయాము. పాపకు ఇంట్లోనే శ్రీబాబు ఫొటో దగ్గర మా వారే అక్షరాభ్యాసం చేసేశారు. తరువాత బాబు దగ్గరకు వచ్చినప్పుడు ఈ విషయం చెబితే మేము "ఏమీ ఫరవాలేదు. ఏకలవ్యుడు ద్రోణుని విగ్రహం పెట్టుకొని విద్య నేర్చుకోలేదా? ఇక్కడకి రాలేదని బాధ పడకు. పాపకు చదువు బాగా వస్తుందిలే" అన్నారు.

1977లో మరొక మగసంతానం కలిగింది. శ్రీబాబు వాడికి 'సుబ్రహ్మణ్యం' అని నామకరణం చేశారు. శ్రీబాబు పరమ అనుగ్రహంతో సంతాన యోగమే లేని మాకు ఆ యోగాన్ని కల్పించి, మా రక్షణ భారాన్ని స్వీకరించి మాకు క్షేమాన్ని కలిగించిన సమర్థసద్గురుశ్రీబాబు.

# గీతోపదేశం

- పసుమర్తి బద్రీనాథ్



వీక్షించండి 'గీతోపదేశం' చిత్రం
గుప్తమైన విశేషార్థాలు ఉన్నాయి - ఎంతో విచిత్రం!

రథమే మానవ దేహం.
దేహంలో ఉన్నాయి పంచేంద్రియ సమూహం!
కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, మరియు చర్మం -
ఇవే అయిదు ఇంద్రియాలు - అంతా సృష్టి మర్మం!

ఇంద్రియాల ప్రభావం మనపై ఎంతో ఉంటుంది.
ప్రాపంచిక విషయాలపై ఆకర్షణ పెంచుతూ ఉంటుంది!
ఈ ఆకర్షణలే మనల్ని ముంచుతాయి.
ఎన్నో సమస్యల్ని కలిగిస్తాయి!

అదుపులో ఉంచుకోవాలి ఇంద్రియాలను.
లేదంటే కోల్పోతాము సుఖసంతోషాలను!

పంచ తురంగాలను వాసుదేవుడు పగ్గాలతో పట్టుకోవడానికి కారణం
పంచ ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలని తార్కాణం.
ఇంద్రియ నిగ్రహంతో
వ్యక్తిత్వం పొందుతుంది దైవత్వం,
దైవత్వానికి ప్రతీకే కృష్ణతత్త్వం !

కృష్ణుడు ప్రజ్ఞానిధి
కిరీటి మానవాళి ప్రతినిధి.
కృష్ణ భక్తియే అతనికి పెన్నిధి.
అందుకే ప్రాప్తించినది కృష్ణసన్నిధి.

నేరుగా పొందాడు గీతోపదేశం,
సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కోవాలన్న సందేశం!

రథం పైన విజయ కేతనం
అది సజ్జీవన తత్త్వ సూచనం.



ఆసీనుడై ఉన్నాడందులో హనుమంతుడు
వజ్రాంగ బలుడు - మహాధీమంతుడు!
తన అరిషడ్వర్గాల్ని అణచిన రామబంటు
అందుకే ఉన్నత స్థాయిలో కూర్చున్నాడు గీత వింటూ!

పురుష ప్రయత్నానికి కుంతీ పుత్రుడు,
దైవానుగ్రహానికి దేవకీ పుత్రుడు,
భక్తి శ్రద్ధలకు అంజనీ పుత్రుడు
ప్రతినిధులు,
మనపాలిటి పెన్నిధులు!

ఈ మూడింటి సమ్మేళనం
కలిగిస్తుంది వ్యామోహ నిర్మూలనం
బంధ విముక్తి మార్గదర్శనం!

ఇదండీ
'గీతోపదేశం' చిత్రంలోని అర్థం,
జీవిత పరమార్థం!

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి — విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

ఆ మాట గురువుగారి చెవిని పడింది. గురువుగారు " నిజమే! శ్రీ బాబు సర్వ సమర్థులని భావించి యిందిరను యిక్కడకు తీసుకుని వచ్చినా, యింకా నేను పూజలు పునస్కారాలూ చేసి దానికి ఏదో మేలు చేయగలననుకోవటం విశ్వాస లోపము, లౌక్యము గాక మరేమవుతుంది?" అని గ్రహించి, అప్పటి నుండి యిందిర కోసం చేసే పూజలు అనుష్ఠానాలు కట్టి పెట్టారు.



విశేష ఆధ్యాత్మిక పరిజ్ఞానం ద్వారా పంటకు వచ్చిన గురువుగారి సాధనకు అప్పటి వరకు అంతో యింతో అడ్డంగా ఉన్న శాస్త్ర వాసన, దేహ వాసన మొదలైన వాటిని నిశ్శేషంగా నిర్మూలించి, ఆమెకు స్వాత్మానంద అనుభవాన్ని ప్రసాదించాలనే పరమ కృపా దృష్టితో, శ్రీ బాబు యిటువంటి నిదర్శనములెన్నిటినో గురువుగారికి చూపించారు

ఒకసారి శ్రీ బాబు ఇందిరను తమ పూజా పీఠం వద్ద కూర్చోబెట్టమని గురువుగారికి చెప్పి, స్నానానికి వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి పీఠంవద్ద కూర్చున్న ఇందిర తన తలను నేలకు వేసి గట్టిగా కొట్టుకుంటోంది, శ్రీ బాబు కొంచెం పూజా కుంకుమను ఇందిర నొసట ఉంచారు.

ఇందిరను ఆవేశించిన గ్రహం శాంతించి, శ్రీ బాబుతో మాట్లాడటం మొదలు పెట్టింది. మాటల సందర్భంలో శ్రీ బాబు "ఒంగోలులో నువ్వేదో ఆశ్రమం కట్టించావట గదా?" అన్నారు. ఆ గ్రహం "నువ్వూ కట్టిస్తావులే, అంతకంటె పెద్ద ఆశ్రమం" అన్నది. శ్రీ బాబు నాకెందుకు ఆ శ్రమం?" అన్నారు. ఆ గ్రహం "నాలాంటి దయ్యాలను అక్కడకు తెచ్చి వదలించటానికి" అన్నది. శ్రీ బాబు పకపకా నవ్వేశారు.

ఇందిరను ఆవేశించిన గ్రహం గురువుగారినీ తదితరులనూ

ఏడిపించుకు తినేది గాని, శ్రీ బాబు దగ్గర మాత్రం హెచ్చరికగానే వుండేది. ఒకసారి గురువుగారితో, ఆ గ్రహం " ఏమేవ్ ? జాగ్రత్త సుమా! ఈయన మహానుభావుడు, సాక్షాత్తు భగవత్ స్వరూపుడే. అది తెలిసి మసులుకో" అని చెప్పింది.

మాటి మాటికి రక్త వమనాలతో ఆ గ్రహం ఇందిరను నానా తిప్పలు పెడుతుంటే, ఒకసారు గురువుగారు దాన్ని నిందిస్తూ మాట్లాడారు. శ్రీ బాబు గురువుగారితో "ఇందిరకు ఏ ప్రాణ భయమూ లేకుండా నేను చూసు కుంటాను. కాని మీరు మాత్రము ఆగ్రహమును గౌరవంగానే చూడండి గాని, ఎన్నడూ నిందించ వద్దు" అని చెప్పారు. ఒక బలవత్తర ప్రారబ్ధంచేత యిటువంటి గ్రహ రూపం పొందిన వ్యక్తి అద్వైత జ్ఞాన ఖని అని చెప్పారు. ఇందిరకు బాధా నివృత్తి కలిగించటంతో పాటు, ఆపిశాచానికి కూడా ముక్తి కలుగ జేయాలని సంకల్పించటమూ, ఆగ్రహముపై నిర్హేతుకజాయమానకరుణా కటాక్షము వర్షించటమూ సర్వ సమదర్శనుడైన భగవానునికి మాత్రమే చెల్లు, శ్రీ బాబు కేవలం భగవత్స్వరూపులుకదా!

ఇందిరను ఆవేశించిన గ్రహం చాలా శక్తివంతమైనది. అది ఇందిరను చంపాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. కాని గురువుగారి అప్రమత్తత వల్ల ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఒక సారి గురువుగారికి ఏదో అత్యవసరమైన పని ఉండి, ఇందిరను ఎలా వదిలి వెళ్ళాలా అని ఆలోచిస్తుంటే, సుబ్బారాయుడు గారు "నేను చూసుకుంటానులే, నువ్వు వెళ్ళమ్మా!" అన్నారు. గురువుగారు భయపడుతూనే వెళ్ళారు, ఇందిర గభాలున లేచింది. సుబ్బారాయుడుగారు తమ బలమంతా వుపయోగించి ఇందిరను పట్టుకోబోయారు , ఆయన చెంప 'చెళ్ళు' మంది. ఆ దెబ్బతో దూరంగా ఉన్న రోటి మీదకు వెళ్ళి పడిన సుబ్బారాయుడు గారు, తగిలిన దెబ్బలు చూసుకోవటానికి గాని, ఊడిపోతున్న పంచె కట్టుకోవడానికి గాని టైము లేక భయంతో వణికిపోతూ పరుగెత్తి పోయారు. అంతలో గురువుగారు రానే వచ్చారు. "ఆ సుబ్బారాయుడు భయపడిపోయాడు గాని ఆయన మొహాన కాస్త విభూతి పెట్టు పాపం!" అంది ఇందిర (గ్రహం). ఆ తరువాత సుబ్బారాయుడు గారికి మూడు రోజులపాటు జ్వరం వచ్చింది. గురువుగారే ఆయనికి సేవ చేసి స్వస్థత కలిగించారు.

-సశేషం

(గతసంచిక తరువాయి) విఠ్ఠల  కథలు -రమణ ప్రసాద్

# 7. రోహిదాసు

దామాచందుడు బ్రహ్మచారిని ఓదారుస్తూ “నాయనా! దిగులు చెందకు. నేను నిమిత్త మాత్రుడను. ఇదంతా భక్త వత్సలుడైన పాండురంగని దివ్య సంకల్పం. నీకు అది చివరి జన్మ. ఇది భక్తికి జాతి, వర్ణ, లింగ భేదాలు లేవని నీ జీవితం ద్వారా ప్రపంచానికి తెలియ చేయటానికి భగవంతుడు చేసిన ప్రణాళిక. బ్రహ్మచారి తన కన్నీటితో గురు పాదాలను అభిషేకించి శెలవు తీసుకొంటాడు. కొంత కాలానికి, బ్రహ్మచారి గతిస్తాడు. అతడే తను సంభావన గ్రహించిన “రఘు” అనే మాదిగ వాని ఇంట రోహిదాసుగా జన్మిస్తాడు. ఈ నాడు తనని దర్శించటానికి వచ్చిన నర్తకి ఎవరో



కాదు. గత జన్మలో తాను సంభావన గ్రహించటానికి నిరాకరించినది. ఈ నర్తకి వద్దనే తన గత జన్మల వివరాన్ని తెలియచేయగానే రాజ నర్తకి దిగ్భ్రాంతి చెంది రోహిదాసుకు నమస్కరించి “మహాపురుషా! మీరు జ్ఞాన స్వరూపులు. మీకు చెప్పదగిన వారముకాము. మీరు అన్న పానీయాలని విసర్జించుట ముక్తి కాదు. అలా చేయటం వలన మీరు కాని దేహాన్ని మీరు శుష్కింప చేస్తున్నారు. ఈ శరీరం భగవానునిది. దానిని పని ముట్టున భగవానుడు మీద్వారా చేయించవలసిన కార్యాలు నిర్వహించాలి. మీరు ఇలా ఆహారం గ్రహించకుండా ఉండటం చేత భగవానుని దివ్య సంకల్పానికి అవరోధం కల్పించిన వారు అగుచున్నారు” అని చెబుతుంది.

నర్తకి ప్రబోధం చేత తను ఆహారం తీసుకోవటం మొదలు పెట్టాడు.

రోహిదాసు పెరిగి పెద్ద వాడవుతున్నాడు కాని అతని ప్రవర్తన ఎవరికీ అంతుపట్టడం లేదు. ఎవరితోనూ మాట్లాడడు. ఏపనీ చేయడు. తండ్రికి వృద్ధాప్యం సమీపిస్తోంది. కుమారుని తన కుల వృత్తిలో ఉంచి తాను విశ్రాంతి తీసుకోవాలను కుంటాడు. కాని రోహిదాసు జంతువుల చర్మాలతో చెప్పలు కుట్టలేక పోతున్నాడు. అతని హృదయం జీవకారుణ్యంతో నిండి పోయింది.

ఒకనాడు రామానంద స్వామి తన ఇంటిముందు నడుస్తూ వుంటాడు. రోహిదాసు తండ్రి రఘు చూసి రామానందుని పాదాలపై పడి నమస్కరించి "మహాత్మా! నాకు రోహిదాస్ అనే పుత్రుడు ఉన్నాడు. అతనికి యుక్త వయస్సు వచ్చినా ఉదాసీనంగా ఉంటూ ఏ పని యందూ ఆసక్తి చూపకుండా ఉన్నాడు. వృద్ధులైన మాకు అతడొక్కడే ఆధారం . తమ కరుణా వీక్షణాలతో అతను క్రియాశీలుడయ్యేటట్లు చేయండి." అని రామానందుల వారిని ప్రార్థించాడు.

రఘు ప్రార్ధనను విన్న రామానందుల మనస్సు ద్రవించింది. అతని ఇంట్లోకి వెళ్ళి రోహిదాసును చుశాడు. అతడు ఎవరో కాదు తన శిష్యుడే అని గ్రహించాడు. "వత్సా! ఏంచేస్తున్నావు?" అని ప్రశ్నించాడు. తన గురువులైన శ్రీ రామానందస్వామి జీవించి వున్నారని చూసి రోహిదాస్ సంతోషంతో ఉప్పొంగిపోయాడు. "గురుదేవా! రామానామామృతాన్ని పానం చేస్తున్నాను" అన్నాడు "ఇక మీదట ఏం చేయదల్చావు? అని ప్రశ్నించారు రామానందస్వామి "మీ ఆజ్ఞ! మీరు ఎలా నడుచుకోమంటే అలా నడుచుకుంటాను" అన్నాడు రోహిదాసు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL